ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 34.0

కనిష్ఠం : 26.0



యోగా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి

» కలెక్టర్ వెట్రిసెల్వి..టీటీడీసీలో యోగా ఓరియంటేషన్

పెదపాడు/ఏలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, ఇది వారి మెరుగైన జీవనానికి దోహదం చేస్తుందని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. వట్లూరులోని టెక్నికల్ ట్రైనింగ్ అభివృద్ధి సంస్థ (టీటీడీసీ)లో జిల్లాస్థాయి యోగా ఓరియంటేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి బుధ వారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు నెలరోజుల పాటు యోగా మాసంగా పాటించి, జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తామన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగా మంచి సాధనమన్నారు. జేసీ ధాత్రిరెడ్డి మాట్లా డుతూ యోగా ప్రాముఖ్యతను విస్తృతం చేసేందుకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యోగాంధ్రపై రూపొందించిన యాప్‌ను ఆవిష్కరించి, వేముల ధర్మారావు ఆధ్వర్యంలో యోగా శిక్షణ నిర్వహిం చారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, ఆయుష్ ఆర్జేడీ లక్ష్మి సుభద్ర, డీఆర్డీఏ పీడీ విజయరాజు, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సుబ్రహ్మణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జూన్ 21న నిర్వహిస్తున్నందున యోగాంధ్ర-2025పై జిల్లాలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. యోగాంధ్రపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుధవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి హాజర య్యారు. అనంతరం జిల్లా అధికారులతో వీరిద్దరూ సమీక్షించారు.

వెబ్‌ల్యాండ్ తిప్పలు!

» 1,498 మంది మృతి చెందిన రైతు కుటుంబాలకు ఇబ్బందులు

» అన్నదాత సుఖీభవ పథకం అందకుండా పోయే పరిస్థితి

» ఓపెన్ చేయని వెబ్‌ల్యాండ్ పోర్టల్‌తోనే సమస్య

■ లోపలి పేజీలో..

ఇసుక కష్టాలకు చెక్!



చేబ్రోలులోని ఇసుక స్టాక్ పాయింట్

జిల్లాలో ఐదు స్టాక్ పాయింట్లు

వర్షాకాలం అవసరాలకు ఇసుక నిల్వలను ఉంచుతూ ప్రతి నియోజకవర్గ పరిధిలో ఇసుక స్టాక్ పాయింట్లు అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు చేపట్టిన కసరత్తులు కొలిక్కి వచ్చాయి. ఈ మేరకు ఐదు స్టాక్ పాయింట్లలో ఈ నెలాఖరు నాటికి ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను తరలించి నిల్వ ఉంచనున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

» ఐదు నియోజకవర్గాలు.. ఐదు లక్షల మెట్రిక్ టన్నులు

» నెలాఖరులోగా తాడిపూడి నుంచి నిల్వలు తరలింపు

» ఐదు నెలల అవసరాలకు సరిపోతాయని అంచనా

తూర్పుగోదావరి జిల్లాలోని తాడిపూడి ఇసుక రీచ్ నుంచి మన జిల్లాకు కేటాయింపుల్లో భాగంగా ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను రవాణా చేయడానికి టెండర్లను ఇటీవల ఖరారు చేసి కాంట్రాక్టర్లకు అప్పగించారు. జీపీఎస్‌తో అను సంధానం కలిగిన పర్మిట్లకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా, తాజాగా మెట్రిక్ టన్ను ఇసుక చార్జీలను జిల్లా ఇసుక కమిటీ నిర్ధారించింది. ఉంగుటూరు వద్ద మెట్రిక్ టన్ను ఇసుక రూ.554, చింతలపూడి, ఏలూరుకు రూ.630, కైకలూరు, నూజివీడులకు రూ.730 ధరలను జిల్లా ఇసుక కమిటీ నిర్ధారించింది. ఉంగుటూరు నియోజక వర్గానికి చేబ్రోలు స్టాక్ పాయింట్‌ను కేవీఏఎస్ ఎస్ ఎస్టేట్స్, చింతలపూడి నియోజక వర్గానికి షర్వీ కన్‌స్ట్రక్షన్స్, ఏలూరు నియోజ క వర్గానికి చొదిమెళ్ల వద్ద స్టాక్ పాయింట్ బీఆర్‌సీ కన్ స్ట్రక్షన్స్, కైకలూరు (చావలి పాడు), నూజివీడు (మీర్జాపురం)స్టాక్ పాయింట్ ను గోదావరి, కృష్ణా వాటర్ వేస్‌లు టెండర్లు దక్కించుకున్నాయి. వారంతా నిర్దేశిత గడువులోగా ఇసుక నిల్వలను తరలించడానికి ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు.

నెలాఖరులోగా తరలింపు

తాడిపూడి ఇసుక రీచ్ నుంచి జీపీఎస్ కూడిన రవాణా వాహనాలతో స్టాక్ పాయింట్లకు కాంట్రాక్టర్లు ఇసుక నిల్వ లను తరలించేలా ఏర్పాట్లు చేశారు. జూన్ మొదటి వారంలో రుతుపవనా ల తాకిడితో భారీవర్షాలకు అవకాశం ఉండడంతో ఈలోగా అంటే ఈ నెలా ఖరులోగా ఐదు స్టాక్ పాయింట్ల వద్దకు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను తరలించనున్నారు. జూన్ మొదటి వారం నుంచి ప్రతీ నియోజక వర్గంలో ఇసుక నిల్వలను అందుబాటులో ఉంచను న్నారు. జూన్ నుంచి అక్టోబరు నెలాఖరు వరకు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు సరి పోతాయని అంచనా వేశామని, పారదర్శకంగా ఇసుక నిల్వలను స్టాక్ పాయింట్ల వద్ద ఉంచేం దుకు ఏర్పాట్లు చేసినట్టు జిల్లా గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు.



దెందులూరులో మహానాడు జోష్

దెందులూరు మండలం గోపన్నపాలెం (లక్ష్మీపురం) వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో దెందులూరు నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు బుధవారం ఘనంగా జరిగింది. మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, దెందులూరు నియోజకవర్గ పరిశీలకుడు చెన్ను గాంధీ తదితరులు హాజరయ్యారు.

■ లోపలి పేజీలో..

కొనసాగిన సప్లిమెంటరీ పరీక్షలు

ఏలూరు అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : పదో తర గతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన ఇంగ్లీషు పరీక్షకు జిల్లాలో 2,356 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,504 మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. సార్వత్రిక విద్యా పీఠం దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్షకు 69 మంది దరఖాస్తు చేసుకోగా 60 మంది, ఆర్థిక శాస్త్రం పరీక్షకు 146 మందికి 118మంది, టెన్త్ తెలుగు పరీక్షకు 150 మందికి 125మంది హాజరయ్యారని వివరించారు.

ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలకు 35 మంది గైర్హాజరు

ఈఏపీ సెట్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలకు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ పరీక్ష కేంద్రానికి ఉదయం, మధ్యాహ్నం షిఫ్టుల్లో 160 మంది విద్యార్థులు చొప్పున కేటాయించగా 155, 150 మంది హాజరయ్యారు. ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రానికి 150 మంది చొప్పున కేటాయించగా 145, 146 మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి 177 మంది చొప్పున కేటాయించగా రెండు షిఫ్టుల్లోను 171 మంది చొప్పున హాజరయ్యారు. మొత్తం మీద 35 మంది గైర్హాజరయ్యారు.

జూన్‌లో సామూహిక గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు : పీడీ



ఏలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో జూన్ 10 తర్వాత సామూ హిక గృహప్రవేశాలకు 13వేల125 ఇళ్ల నిర్మా ణాలు పూర్తి చేయనున్న ట్టు గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జి.సత్యనారాయణ తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఇళ్ల పురోగతిని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల ఇళ్లను జూన్ 10 నాటికి సిద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టు కుందన్నారు. జిల్లాలో 13వేల525 ఇళ్లకుగాను ఇప్పటి వరకు 8వేల171 ఇళ్ల నిర్మాణాలతో 60 శాతం పూర్తి చేసి రాష్ట్రంలోనే జిల్లా టాప్-3గా నిలిచిందన్నారు. మిగి లిన 5వేల400 ఇళ్లను ఈ నెలాఖరుకు పూర్తి చేయడా నికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జూన్ 10 నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు ఇళ్లను సిద్ధం చేస్తున్నా మన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనంగా రూ.50 వేలు లబ్ధి కలిగిస్తోందని, జిల్లాలో ఇంత వరకు 5వేల178 మంది లబ్ధిదారులకు రూ.9.28 కోట్లు అందించామన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు అదనంగా మరో రూ.30 వేలు నుంచి రూ.లక్ష వరకు పావలా వడ్డీకి రుణాలు అందిస్తున్నట్టు వివరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సొంతస్థలం కలిగిన ఇళ్లు నిర్మించేం దుకు జిల్లాలో 2,600 లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 1,200 స్థలాలకు డీపీఆర్‌ను ప్రభుత్వానికి పంపామన్నారు. గిరిజన ప్రాంతాల్లో జన్‌మన్ పథకం కింద 698 దరఖాస్తులు అందగా, వాటిల్లో 590 ఇళ్లకు మంజూరుకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు.

ప్రమాదాలపై నిరంతర నిఘా

» ప్రజల్లో అవగాహనకు ప్రత్యేక చర్యలు

» మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు..తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

» అదనపు లోడుతో వెళ్లే వాహనాలకు ఫైన్.. సీజ్

» జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ షేక్ కరీం

» 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్'కు విశేష స్పందన

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్



ఏలూరు/ ఏలూరు క్రైం, మే 21 (ఆంధ్రజ్యోతి) : 'జిల్లాలో వాహనాల ప్రమాదాలను తగ్గించేందుకు ప్రజలను అప్రమత్తం చేసే దిశగా అవగాహన కల్పిస్తున్నాం. నిరంతరం నిఘా పెట్టి తనిఖీలు చేస్తున్నాం. అదనపు లోడుతో వెళ్లే వాహనాలపై దాడులను చేసి సీజ్ చేయడంతో పాటు ఫైన్‌లు విధిస్తున్నాం. అనుమతుల్లేకుండా ఒకే పర్మిట్లపై నడిచే బస్సుల ను సీజ్ చేస్తున్నాం' అని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ (డీటీసీ) షేక్ కరీం తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' బుధవారం డీటీసీతో నిర్వహించిన ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన లభించింది. పలువురు తమ సందేహాలను వెల్లిబుచ్చగా డీటీసీ నివృత్తి చేశారు.

- మైనర్లు లైసెన్సులు లేకుండా ద్విచక్ర వాహనాలను నడపడం వల్ల తరచూ స్థానికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చర్యలు తీసుకోవాలి.

- మణికంఠ, చాట్రాయి

డీటీసీ : తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌లు చేపడుతున్నాం. పిల్లలు ప్రమాదాలు చేస్తే తల్లి దండ్రులకు రూ.25 వేలు జరిమానా విధిస్తున్నాం.

- విసన్నపేట- చాట్రాయి రోడ్డులో ప్రభుత్వ హైస్కూల్, పీహెచ్‌సీ పరిసరాల్లో లైసెన్సు లేకుండా ట్రాక్టర్లు నడపడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

- మహేష్, చాట్రాయి

డీటీసీ: ప్రత్యేక నిఘా పెడతాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- పోలవరంలో బస్‌షెల్టర్ల వద్ద బస్సులు నిలపకుండా, పాత భాను థియేటర్ వద్ద బస్సులు నిలపడం వల్ల వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొని తరచూ ప్రమాదాలు జరుగుతున్నా యి. పోలవరం- కొవ్వూరు రోడ్డుపై ఇసుక నిల్వలను వాహ నాల్లోకి లోడింగ్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- కపిలేశ్వరరావు, పోలవరం

డీటీసీ : నిర్దేశిత ప్రాంతాల్లో బస్సులు నిలుపుదల చేసేలా ఆర్టీసీ అధికారులకు వివరిస్తాం. ఇసుక లోడులను రోడ్డుకు అడ్డంగా చేసేవారిపై కేసులు పెడతాం. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌ను పంపి పరిస్థితిని తెలుసుకుంటా.

- జంగారెడ్డిగూడెంలోని బుట్టాయగూడెం రోడ్డులో పొట్టి శ్రీరాములు విగ్రహం నడిరోడ్డుపై ఉండడం వల్ల ఎటువైపు వాహనాలు వెళ్తున్నాయో తెలియక ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు.

- ముప్పిడి దుర్గారావు, ఆటో యూనియన్ ప్రెసిడెంట్, జంగారెడ్డిగూడెం

డీటీసీ: ఈ అంశాన్ని రోడ్‌సేఫ్టీ కమిటీ సమావేశంలో నివే దించి చర్యలు తీసుకుంటాం.

- డ్రైవింగ్ లైసెన్సు కోసం ఏయే పత్రాలు అవసరమో తెలప గలరు. ఎంతకాలం పడుతుంది.

- కె.చంద్రశేఖర్, ఏలూరు

డీటీసీ: 18 ఏళ్ల వయస్సు నిండితే నే డ్రైవింగ్ లైసెన్సుకు అర్హులు, ఆధార్ కార్డు, అడ్రస్ ప్రూఫ్‌తో ఆన్‌లైన్‌లో ఎల్ఎల్ ఆర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ద్విచక్ర వాహన లైసెన్సుకు రూ.250, కారుకు కూడా కావాలంటే రూ.410 చెల్లించాలి. నెల రోజుల తర్వాత ఎల్ఎల్ఆర్ కోసం మా కార్యాలయంలో టెస్ట్ నిర్వహిస్తాం.అందులో పాసైతే రూ.960 చెల్లిస్తే ఒక నెల తర్వా త లైసెన్సు ఇస్తాం.

- హెల్మెట్‌లు హైవేలపైనే పెట్టుకోవాలని, మిగతా చోట్ల అవసరం లేదని ప్రచారం జరుగుతోంది.

- విల్సన్, పెదవేగి

డీటీసీ : టూ వీలర్ కలిగిన వారు ఖచ్చితంగా హెల్మెట్ వాడాల్సిందే. ఇందులో మినహాయింపు లేదు. బైక్‌తో బయట కొస్తే హెల్మెట్‌తోనే రావాలి. లేకపోతే జరిమానా తప్పదు.

- మా ప్రాంతంలో పరిమితికి మించి ఆటోల్లో జనాలను తరలి స్తున్నారు. వాహనాల్లో పరిమితికి మించి ఇసుక, గ్రావెల్ తరలిస్తున్నారు. అవి జనాలపై పడడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

- కె.సత్యనారాయణ, బుట్టాయగూడెం

డీటీసీ: పరిమితికి మించి వాహనాల్లో, ఆటోల్లో ఎక్కించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రూ. పదివేలు జరిమానా విధిస్తాం. అదనంగా ఎక్కిన ప్రయాణికుడి నుంచి రూ.100 జరిమానా వసూలు చేస్తాం. ఓవర్ లోడుతో లారీలు, టిప్పర్లు ప్రయాణిస్తే రూ.20 వేల జరిమానా విధిస్తున్నాం. టన్నుకు రూ.2వేల వసూలు చేస్తున్నాం.

- ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సుల వల్ల మా ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. స్కూల్ యాజమాన్యాలపై ఏ చర్యలు తీసుకుంటున్నారు.

- ఎల్.వెంకటేశ్వరరావు, కామవరపుకోట

డీటీసీ : 15 ఏళ్లు పూర్తి చేసుకున్న స్కూల్ బస్సులను తిరగనీయడం లేదు. జిల్లాలో 960 స్కూల్ బస్సులు నడుస్తు న్నట్టు అంచనా. ఈ నెలలో స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ టెస్ట్‌లు చేయించుకుంటేనే వాటిని స్కూల్స్‌లో పెట్టాలని ఆదేశాలు జారీ చేశాం. అలా చేయని వాహనాలను సీజ్ చేస్తాం.

- జంగారెడ్డిగూడెం నుంచి తడికలపూడి వరకు రోడ్డు పూర్తిగా పాడైపోయింది. మరమ్మతులకు చర్యలు తీసుకోవాలి

-వై.రఘు, జంగారెడ్డిగూడెం

డీటీసీ : జిల్లా ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ మీటింగ్‌లో చర్చిస్తాం. ఆర్అండ్‌బీ అధికారులకు పరిస్థితిని నివేదిస్తాం.

- వ్యవసాయ సీజన్‌లో దమ్ము ట్రాక్టర్లు తిరగడం వల్ల రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఆటోలు, ట్రాక్టర్లు లైసెన్సు లేకుండానే విచ్చలవిడిగా నడుస్తున్నాయి.

- రామారావు, దెందులూరు

డీటీసీ: దమ్ము ట్రాక్టర్లు తిరగనీయకుండా చర్యలు తీసు కోవాలని వ్యవసాయ, ఆర్అండ్‌బీ అధికారులను కోరతాం. ఆటోలు, ట్రాక్టర్లు లైసెన్సు లేకుండా నడిపేవారిని ఉపేక్షిం చడం లేదు. క్వార్టర్లీ టాక్స్ కట్టని వాహనాలపై 200 శాతం ఫైన్ విధిస్తూ, వారి వాహనాలపై కేసులను రాస్తున్నాం.

1600 మంది టీచర్లకు తప్పనిసరి బదిలీ!

» మరికొందరికి రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్లు

» పునర్వ్యవస్థీకరణ మేరకే ఉమ్మడి జిల్లాలో 11,409 టీచరు పోస్టుల హేతుబద్ధీకరణ

» గ్రేడ్-2 హెచ్‌ఎంల దరఖాస్తుల స్వీకరణతో ప్రారంభమైన బదిలీలు

ఏలూరు అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యా యుల సాధారణ బదిలీల ప్రక్రియ బుధవారం ప్రారం భమైంది. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ మేరకు వచ్చే జూన్ నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తం గా ప్రారంభం కానున్న 8 రకాల (శాటిలైట్ స్కూల్స్ కలిపితే మొత్తం 9 రకాలు) ప్రభుత్వ బడులకు సం బంధించి ఏర్పాటైన 2,921 పాఠశాలలకు ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి ప్రాతిపదికన కేటాయించిన పోస్టు లకు నిర్ణీత అర్హతలు గల టీచర్లు బదిలీకి దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. తొలుత గ్రేడ్-2 హెచ్ఎంల బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ బుధవారం సాయంత్రం ప్రారంభమైంది. దీంతోపాటే స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ కేడర్ల ఉపాధ్యా యుల బదిలీల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కావా ల్సి ఉండగా, టీచర్ల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్)లో సవరణలకు ప్రభుత్వం అంగీకారం తెలపడంతో ఆ మేరకు పాఠశాలల వారీగా మళ్లీ టీచరు పోస్టులను నిర్ధారించిన అనంతరమే దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించేందుకు నిర్ణయించారు. ఈ ప్రక్రియను గురువారమే పూర్తిచేసి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకర ణను వెబ్‌సైట్‌లో ఎనేబుల్‌చేసే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో 11,409 మంది టీచర్లు

ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే ఉపాధ్యాయుల బదిలీ లు జరుగనున్నాయి. ఈ నెల 31 నాటికి రెండేళ్ల కనీస సర్వీసు పూర్తిచేసినవారు బదిలీకి దరఖాస్తు చేసుకు నేందుకు అర్హులు. ఉమ్మడి జిల్లాలో అన్ని రకాల ప్రభు త్వ యాజమాన్యాల పాఠశాలల్లో మొత్తం 11,409 మం ది స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ కేడర్ల టీచర్లు పని చేస్తున్నారు. మరో 2వేల వరకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ దఫా మున్సిపల్ టీచర్ల బదిలీ లను కలిపి నిర్వహిస్తుండడం విశేషం. బదిలీల ప్రక్రి యను ఈ నెలాఖరులోగా పూర్తిచేసి జూన్ 4నాటికి నూతన స్థానాలకు బదిలీ నియామక పత్రాలను జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, తాజాగా హేతు బద్ధీకరణ నిబంధనలను సవరించే పనిని చేపట్టిన తర్వాతే ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించే అవకాశం ఉండడంతో బదిలీలు పూర్తి కావడానికి మరికొని రోజుల వ్యవధి అవసరమని తెలుస్తోంది. బదిలీలు పూర్తయిన వెంటనే పదోన్నతులను చేపట్టి పూర్తిచేస్తా రు. ప్రభుత్వ/మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలకు కలెక్టర్, జడ్పీ బదిలీలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. చివరిసారిగా 2023లో జరి గిన బదిలీల్లో ఉమ్మడి జిల్లాలో 3వేల మంది ఉపాధ్యా యులు కంపల్సరీ/రిక్వెస్టు విధానంలో నూతన స్థానాల కు బదిలీ అయ్యారు.

స్థానచలనం తప్పనిసరి!

ఉమ్మడి జిల్లాలో కంపల్సరీ ట్రాన్స్‌ఫర్ మొత్తం 1,600 మందికి ఖాయమని నిర్ధారణైంది. ఒకేస్కూలు (స్టేషన్)లో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన గ్రేడ్-2 హెచ్ఎంలు 19 మంది, ఎనిమిదేళ్ల స్టేషన్ సర్వీసు పూర్తిచేసిన ప్రైమరీ స్కూలు హెచ్ఎంలు ముగ్గురు, స్కూల్ అసిస్టెంట్లు అన్ని సబ్జెక్టుల నుంచి 865 మంది, ఎస్జీటీలు 713 మంది 'తప్పనిసరి' బదిలీల జాబితాలో ఉన్నారు. వీరందరూ ఇప్పుడున్న పాఠశాలల నుంచి తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. ఆ మేరకు వీరి వెకెన్సీలన్నీ జాబితాల్లో ప్రదర్శిస్తారు. ఇక బదిలీలకోసం దరఖాస్తు చేసుకున్న గ్రేడ్-2 హెచ్ఎంలు నూతన స్థానాలకు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకునేందుకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 125 వెకెన్సీలను జిల్లా విద్యాశాఖ వెబ్ సైట్‌లో బుధవారం ప్రదర్శనకు పెట్టింది. హేతుబద్ధీకరణలో సవరణల వల్ల స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీల వెకెన్సీలను గురు లేదా శుక్రవారాల్లో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌చేసే అవకాశం ఉంది.

త్వరలోనే పెద్దచెరువు గండి పూడుస్తాం : మంత్రి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నూజివీడు, మే 21 (ఆంధ్ర జ్యోతి) : నూజి వీడు పెద్దచెరువు ఆక్ర మణలు తొలగించి చెరువు కట్టను పటిష్ఠం చేసేందుకు ప్రభు త్వపరంగా చర్యలు చేపడుతున్నట్టు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పెద్దచెరువు గండి సమస్యపై 'గండి పూడ్చండి' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆయన స్పం దించారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ వర్షాకాలంలో నూజివీడు పట్టణ వాసులకు పెద్దచెరువు నుంచి ఎటు వంటి సమస్యలు తలెత్తకుండా గండిపూడ్చే అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు, ఇరిగేషన్‌శాఖ మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. నిధులు త్వరగా మంజూరు అయ్యేలా చేసి త్వరలో చెరువు ఆక్రమణలను తొలగించి చెరువుకట్టను పటిష్ఠం చేస్తామన్నారు. రైతుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని, ధాన్యం సేకరించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో బిల్లులు జమ అవుతున్నాయన్నారు. సమావేశం లో నూజివీడు మండల టీడీపీ అధ్యక్షులు ముసునూరు రాజా, కౌన్సిలర్ టి.సాధనా స్రవంతి, టీడీపీ నాయకులు ఆరేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నూజివీడులో టీడీపీ జిల్లా మినీ మహానాడు

నూజివీడు : ఏలూరు జిల్లాస్థాయి మినీమహానాడు విజయవంతం చేయడానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈమేరకు బుధవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో మినీ మహానాడు నిర్వ హణపై కార్యకర్తలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నూజివీడు.. మిగతా 8వ పేజీలో



ఆర్డీవోకు విరాళం అందిస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధి కార్మికుల దేశభక్తి

కూలీ డబ్బుల్లో సగం ఆపరేషన్ సిందూర్‌కు విరాళం

నరసాపురం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): వారంతా రోజువారి కూలీలు.. రెక్కాడితే డొక్కాడదు.. అంటువంటి పరిస్థితిలో ఉన్నప్పటికి దేశ సైనికుల కోసం ఏదో చేయాలని తపించారు. సర్పంచ్ వైఎస్ నాగ ముత్యమాంబ ఆధ్వర్యంలో గ్రామంలో ఉపాధి పని కింద చెరువు తవ్వారు. వచ్చిన కూలీ డబ్బుల్లో రూ.10 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఆర్డీవో దాసిరాజుకు అందించారు. ప్రధాని మంత్రికి ఆపరేషన్ సిందూర్‌కు తమ వంతు సాయంగా సైనికులకు అందించాలని విన్నవించారు. వైఎస్‌పాలెం గ్రామంలో సుమారు 300 మంది వరకు ఉపాధి కూలీలు ఉన్నారు. సైనికులకు తమవంతు ఎంతోకొంత సాయం చేయాలని భావించారు. సర్పంచ్ ను కలిశారు. ఆమె సలహా మేరకు గ్రామంలో చెరువు తవ్వారు. ఇలా పని చేయగా... వచ్చిన డబ్బుల్లో కొంత మొత్తాన్ని విరాళంగా సేకరించారు. వీరు చేస్తున్న మంచి పని గురించి తెలుసుకున్న ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ అయితం సత్యనారాయణ, ఎంపీడీవో రామకృష్ణం రాజులు గ్రామానికి చేరుకున్నారు. కూలీలంతా కలిసి సేకరించిన మొత్తాన్ని ఆర్డీవోకు అందించారు. వారందరినీ మీ దేశభక్తికి జోహార్ అంటూ అభినందించారు. ఇదే స్ఫూర్తి ప్రతిఒక్కరిలో ఉండాలన్నారు. వైఎస్ బాబులు, వాసు, వీఆర్వో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల వెంకన్న ఆలయ హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.92 కోట్లు

ద్వారకాతిరుమల, మే 21 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చినవెంకన్నకు హుండీల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. 34 రోజులకు జరిగిన ఈ లెక్కింపులో శ్రీవారికి నగదు రూ.3.92 కోట్లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి తెలిపారు. ప్రమోద కల్యాణమండప ఆవరణలో బుధవారం అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కింపు నిర్వహించారు. నగదుతో పాటు 556 గ్రాముల బంగారం, 8.100 కేజీల వెండి లభించినట్లు ఈవో వివరించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (39), 1000(3) 2000 (22)తో పాటుగా విదేశీ కరెన్సీ లభించింది.

మద్ది క్షేత్రంలో హనుమజ్జయంతి వేడుకలు

జంగారెడ్డిగూడెం,మే 21 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి సందర్భంగా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం హనుమత్ జయంతి సహిత కళ్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 25 వరకు కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షా ధారణ, వాస్తుపూజ, యాగశాల ప్రవేశం, ప్రధాన హోమాల అనంతరం ధ్వజారోహణ కార్యక్రమం వేద పండితులచే నిర్వహించారు. గురువారం ఉదయం ఐదు గంటల నుంచి స్వామివారికి ప్రభాత సేవ, నిత్యార్చన, హనుమత్ జయంతి సందర్భంగా లక్ష తమలపాకుల పూజ నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు మండలంలోని గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయం నుంచి జంగారెడ్డిగూడెం ఇందిరానగర్ కాలనీ వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయం వరకూ హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నాల్గవ వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ తెలిపారు.



మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా హోమం నిర్వహిస్తున్న అర్చకులు

గోకుల తిరుమల పారిజాతగిరిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

జంగారెడ్డిగూడెం, మే 21 (ఆంధ్రజ్యోతి) జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారి జాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు బుధ వారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. ఆలయంలో విశేష పూజలతో పాటు విశేష హోమాన్ని యజ్ఞబ్రహ్మ పానంగిపల్లి సత్య పవన్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అబ్బిన దత్తాత్రేయ, సత్యవతి దంపతులు, వాసవీసాయి నగేష్, వరలక్ష్మి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. హోమం అనంతరం స్వామివారిని శ్రీ రామ చంద్రమూర్తిగా అలంకరించారు. ఈవో మానికల రాంబాబు, ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పేరిచర్ల జగపతిరాజు, సభ్యులు దండు ధనరాజు,కాకాని శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఉత్తమ ప్రదర్శన.. నా శత్రువు

ఏలూరులో ముగిసిన జాతీయ స్థాయి నాటిక పోటీలు

ఏలూరు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి సందేశాన్నిస్తూ ప్రజలను ఆలోచింపజేసే విధంగా నాటిక పోటీలు ప్రదర్శనలు సాగాయి. ఏలూరు వైఎమ్‌హెచ్‌ఏ ప్రాంగణంలో అంబికా సంస్థల వ్యవస్థాపకులు ఆలపాటి రామ చంద్రరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా వైఎంహెచ్ఏ, హేలాపురి కళాపరిషత్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి నాటిక పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. నాలుగు రోజులు పాటు మొత్తం 8 నాటికలు ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనగా యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ హైద్రాబాద్ వారి 'నా శత్రువు', ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా గోవాడ క్రియేషన్స్ 'అమ్మ చెక్కిన బొమ్మ 'ఉత్తమ తృతీయ ప్రదర్శనగా సాయి ఆర్ట్స్ కొలుకలూరి వారి 'జనరల్ బోగీలు' నిలిచాయి. ఉత్తమ నటుడుగా శ్రీగణేష్, ఉత్తమ నటిగా సునయన, ఉత్తమ దర్శకత్వం వడ్డాది సత్యనారాయణ, ఉత్తమ రచన జ్యోతిరాజ్ బొెట్టి, ఉత్తమ సంగీతం లీలామోహన్, ఉత్తమ ప్రతీ నాయకుడిగా గోపరాజు విజయ్, ఉత్తమ హాస్యనటిగా లహరి, బాలనటిగా యశ్వతి ఎంపికయ్యారు. న్యాయ నిర్ణేతలుగా అడపా నూరిబాబు, పిల్ల నటరాజు ఎస్.కస్తూరిరావు వ్యవహరించారు. బహుమతులు, ప్రశంసాపత్రాలను సినీ నిర్మాత అంబికా కృష్ణ, అంబికా రాజా, వైఎంహెచ్ఏ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కెవి సత్యనారాయణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు ఇరదల ముద్దు కృష్ణ, ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, గుత్త కౌశలేంద్రరావు, సంకు సురేష్, ఎండీ ఖాజావలి, తదితరులు పర్యవేక్షించారు.



బహుమతి అందుకుంటున్న తృతీయ ఉత్తమ నాటిక బృందం



ద్వితీయ ఉత్తమ నటుడు అవార్డు అందుకుంటున్న నరసింహారావు

వెబ్‌ల్యాండ్ తిప్పలు!



కుక్కునూరు మండలంలో ముంపులో లేని భూములు

మృతి చెందిన 1,498 మంది రైతుల కుటుంబాలకు ఇబ్బందులు

అన్నదాత సుఖీభవ పథకం అందకుండా పోయే పరిస్థితి

ఓపెన్ చేయని వెబ్‌ల్యాండ్ పోర్టల్‌తోనే సమస్య

కుక్కునూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తూ పెట్టుబడి ఖర్చులు సహాయం కింద రూ.20 వేలు అందించనుంది. భూమి ఉన్న ప్రతీరైతు ఈ పథకానికి అర్హుల వుతారు. వెబ్‌ల్యాండ్ ఆధారంగా రైతుల భూమి వివరాలు, సర్వే నెంబర్లు, ఆధార్‌లింక్, తదితర వివరాలు లాగిన్‌లకు అందిస్తూ తప్పులుంటే సరిచేస్తూ పథకానికి సంబంధించి అర్హుల జాబితాను రూపొందిస్తున్నారు. అయితే కుక్కునూరు మండలంలో అధికారుల సర్వే ప్రకారం దాదాపు 1,498 మంది రైతులు మృతి చెందారు. ఇంకా వారి పేరు మీదే భూములున్నాయి. రెవెన్యూ పహానిల్లోనూ పట్టాదారులుగా మృతి చెందిన రైతుల పేర్లు ఉన్నాయి. రైతుల వివరాలు, వారి ఆధార్, ఫోన్‌నెంబర్ లింక్ తప్పనిసరి కావడంతో అన్నదాత సుఖీభవ పథకంలో మృతి చెందిన రైతుల వివరాలు నమోదు చేయడానికి సమస్య ఏర్పడింది. దీంతో 1,495 మంది రైతుల పేర్లు రిజెక్ట్ కావడంతో వారి కుటుంబ సభ్యులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందకుండా పోయే పరిస్థితి ఏర్పడింది.

కుక్కునూరు మండలంలో 12 రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఉన్న గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 3,200 మంది రైతుల వివరాలు సేకరించగా 1,498 మంది రైతులు మృతి చెందినట్లు గుర్తించారు. ఇంకా 1,700 పైగా రైతు వివరాలు పరిశీలించాల్సి ఉంది. ఆన్‌లైన్ చేసే క్రమంలో నామిని ఆప్షన్ ఇచ్చి ఉంటే వారికి పెట్టుబడి సాయం అందేదని అధికారుల ఆలోచన. నామిని ఆప్షన్ ఇవ్వక పోవడంతోనే పెట్టుబడి సాయం అందడం లేదు. లీగర్ హై ర్ ద్వారా నామిని ఆప్షన్ ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి దృష్టికి తీసు కెళ్లినట్టు మండల వ్యవసాయాధికారి బాలాజీ తెలిపారు.

ఎనిమిదేళ్లుగా నిలిచిపోయింది..

2017 నుంచి కుక్కునూరు మండల రైతాంగం వెబ్‌ల్యాండ్ సమస్య ఎదుర్కొంటున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కుక్కునూరు మండలంలో 2017లో భూసేకరణ జరిగింది. ఆ సమయంలో వెబ్‌ల్యాండ్‌లో చేర్పులు, మార్పులు జరగ కుండా ఉండడం కోసం ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్ నిలిపివేశారు. భూసేకరణ పూర్తయ్యి ఇప్పటికి దాదాపు ఎనిమిదేళ్లు అవుతున్న వెబ్‌ల్యాండ్ మళ్లీ ఓపెన్ చేయలేదు. భూసేకరణ చేయగా ఇంకా మండలంలో ఐదు వేల ఎకరాలకు పైగా మిగులు భూమి ఉంది. వెబ్‌ల్యాండ్ ఓపెన్ చేయకపోవడంతో ఆ భూములకు సంబంధించి రైతుల మధ్య క్రయ విక్రయాలు నిలిచిపోయాయి. ప్రభుత్వం నుంచి రైతులకు అందే డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయ పనిముట్లు, విద్యుత్ మోటార్ల ఏర్పాటుకు సబ్సిడీ రుణాల మంజూరు కాకుండా నిలిచిపోయాయి. వెబ్‌ల్యాండ్ ఓపెన్ చేస్తే మృతి చెందిన రైతుల పేరుమీద ఉన్న భూములను వారసత్వంగా ఆ కుటుంబాలకు పంపకాలతో పాటు పట్టాదారు పాస్ పుస్తకాల్లో మార్పిడి జరిగి తద్వారా వారసత్వ భూమిపై హక్కు ఉండేది. మృతి చెందిన వారి పేరుమీదే భూములు ఉండడంతో వేలాది కుటుంబాలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

సీఎం దృష్టికి సమస్య

కుక్కునూరు మండలానికి సంబంధించి వెబ్‌ల్యాండ్ ఓపెన్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి గత నెల పోలవరం పర్యటనకు వచ్చినప్పుడు స్థానిక కూటమి నాయకులు తెలిపారు. వెంటనే ఈ సమస్య పరిష్కరించాలని సీఎం కలెక్టర్‌ను ఆదేశించారు. అప్పటి నుంచి వెబ్‌ల్యాండ్ ఎప్పుడు ఓపెన్ అవుతుందా..అని రైతులు ఎదురు చూస్తూనే ఉన్నారు.

నామినీ ఆప్షన్ ఇస్తే న్యాయం : బాలాజీ, ఏవో

ఇప్పటి వరకు మండలంలో సర్వే చేయగా 1,498 మంది రైతులు మృతి చెందినట్టు నివేదిక వచ్చింది. ఇంకా 1700 మంది రైతుల వివరాలు పరిశీలించాల్సి ఉంది. ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం మృతి చెందిన కుటుంబాలకు అందాలంటే నామిని ఆప్షన్ ఇస్తే న్యాయం జరగవచ్చు. మృతి చెందిన రైతు బదులు నామిని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే పెట్టుబడి సాయం అందే అవకాశం ఉంది.

• పెట్టుబడి సాయం అందని పరిస్థితి



మాకు ఎకరం భూమి ఉంది. నా భర్త శేషయ్య మృతి చెందారు. ఇంకా ఆయన పేరు మీదే ఆ భూమి ఉంది. నా పేరు మీద మార్చుకుండా మంటే వెబ్‌ల్యాండ్ సమస్య అంటున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం అందని పరిస్థితి ఏర్పడింది.

- గొర్ల కుమారి, అల్లిగూడెం

అటవీ ఆదాయానికి గండి

జీసీసీ మనుగడ ప్రశ్నార్థకం

తగ్గుముఖం పడుతున్న అటవీ ఉత్పత్తుల అమ్మకాలు, కొనుగోళ్లు



బుట్టాయగూడెం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కెఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా జరుగుతున్న అటవీ ఉత్పత్తుల అమ్మకాలు, కొనుగోళ్ల గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గుతున్నాయి. అటవీ ఉత్పత్తుల పైనే ఆధారపడి ప్రభుత్వం జీసీసీని ఏర్పాటు చేసింది. అటువంటిది నేడు దాని మనుగడే ప్రశ్నార్థకంగా మారడంతో ఇతర వ్యాపారాలపై దృష్టి సారించింది. ఒకప్పుడు అన్నిరకాల అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ ఆదాయాన్ని గడించిన జీసీసీ నేడు కొన్ని ఉత్పత్తుల సేకరణకే పరిమితమైంది. అడవి నుంచి గిరిజనులు సేకరించే ప్రతి ఉత్పత్తిని సంతలు, డీఆర్ డిపోల్లోని సిబ్బంది చేత జీసీసీ కొనుగోలు చేసేది. రానురాను గిరిజనులు అటవీ ఉత్పత్తుల సేకరణ తగ్గించి వేశారు. అందుకు అనేక కారణాలు లేకపోలేదు. వ్యవసాయాలు పరంగా అభివృదిని సాధిం చడం, కరువు పనులు తదితర కారణాలతో అటవీ ఉత్పత్తుల సేకరణ చాలావరకు తగ్గి పోయింది. ఒక్కప్పుడు వ్యాపారాలతో కోట్లు గడించిన జీసీసీ నేడు ఆదాయం లక్షల్లోకి పడి పోయింది. ఉతత్తుల సేకరణే కాకుండా అటవీ ఉత్పత్తులు కూడా తగ్గిపోవడంతో గతంలోలాగా గిరిజనులు శ్రద్ధ చూపడం లేదు. కష్టపడి ఉత్పత్తులను సేకరించినా గిట్టుబాటు ధరలు రాకపోవడంతో ఆటుగా చూడటం లేదు. దీంతో జీసీసీ ద్వారా జరిగే ఉత్పత్తుల అమ్మకాలు కొనుగోళ్ళు తగ్గిపో యాయి. ప్రస్తుతం జీసీసీ ద్వారా వేళ్ళపై లెక్కించే రీతిలోనే అటవీ ఉత్పత్తుల సేకరణ జరుగుతుంది.

ప్రస్తుతం జీసీసీ ద్వారా కరక్కాయ, తానికాయలు, తేనె, ఇప్పతీగనల్ల జీడిగింజలు, ముసినిగింజలు, షికాకాయ, గానుగ గింజలు, ఎండు మిరపకాయలు, గమ్ కొంటున్నారు. వందల రకాల ఉత్పత్తుల సేకరణ నుంచి పదుల సంఖ్యలోకి కొనుగోళ్ల తగ్గాయి. ప్రస్తుతం జీసీసీ ద్వారా పెట్రోల్, డీజిల్, సూపర్ మార్కెట్లు, ఇతర షాపుల ద్వారా జీసీసీ ఉత్పత్తుల అమ్మకాలు చేస్తున్నారు. కెఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని జీసీసీ ద్వారా పెట్రోల్, డిజిల్ ద్వారా నెలకు 18 కోట్ల రూపాయల అమ్మకాలు చేస్తున్నారు. ఎండుమిర్చి 2 వేల క్వింటాళ్ళు కొని పౌడర్ చేసి అమ్మకాలు చేస్తున్నారు. గిరిజనులు తేనె, చింతపండు, చీపుళ్ల తదితర వాటిని బయట వ్యక్తులకు అమ్ముతున్నారు. ఫలితంగా జీసీసీ ఆదాయం తగ్గుముఖం పట్టింది.

• వ్యాపార విస్తరణకు చర్యలు



వివిధ కారణాలతో అటవీ ఉత్పత్తుల సేకరణ తగ్గడంతో కొనుగోళ్ల తగ్గాయి. గిరిజనులు ఎన్ని రకాల ఉత్పత్తులను సేకరించినా కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతం అటవీ ప్రాంతాల్లోని కొండరెడ్లు మాత్రమే కొన్నిరకాల అటవీ ఉత్పత్తులను సేకరించి అమ్మకాలకు తెస్తున్నారు. కొనుగోళ్ళు తగ్గడంతో ఇతర వ్యాపారాలపై దృష్టి పెట్టాం. పెట్రోల్, డీజిల్ అమ్మకాలు బాగున్నాయి. సూపర్ మార్కెట్ వల్ల ఆదాయం ఫర్వాలేదు. జీసీసీ ఉత్పత్తులను ప్రజలు బాగా ఆదరి స్తున్నారు. వ్యాపారాలను విస్తరించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- సీహెచ్ రాజయోగి, జీసీసీ ఇన్‌చార్జి మేనేజర్



ఏపీ సీడ్స్ కార్యాలయంలో సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

ఖరీఫ్‌కు విత్తనాలు రెడీ

తణుకు, మే 21 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన వరి విత్తనాలను ఏపీ సీడ్స్ కార్పొరేషన్ వద్ద అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ ఏడాది కూడా 31 వేల 750 క్వింటాళ్ళు వివిధ రకాల వరి విత్తనాలు సిద్ధం చేశారు. చాలావరకు రెతులు నుంచి రైతులు సొంతంగా వరి విత్తనాలు సేకరించుకుంటున్నారు. ఇదే ఆనవాయితీ చాలా సంవత్సరాల నుంచి వస్తున్నది. ప్రభుత్వం ఇచ్చే రాయితీ విత్తనాలు, ఏపీ సీడ్సు విత్తనాలు కూడా అదనంగా ఉంచుకుంటారు. రైతులు కొత్త వంగడాలు వచ్చినపుడు మాత్రమే ఫౌండేషన్ సీడ్ వైపు ఆసక్తి చూపుతుంటారు. వీటితో పాటు సాధారణ విత్తనాలను గ్రామాల్లో రైతులు నుంచి సేకరించుకుంటారు.

అందుబాటులో ఉన్నవి ఇవీ..

ఏపీ సీడ్స్ వద్ద 2024-2025 సంవత్సరానికి సంబంధించి జిల్లా యంత్రాంగం నుంచి వచ్చిన ఇండెంట్ ప్రకారం 1185 క్వింటాళ్ళు కాని సీడ్సు వద్ద మాత్రం వివిధ రకాలు 31 వేల 750 క్వింటాళ్ల అందుబాటులో ఉన్నాయి. ఎంటీయూ-1121, ఎంటీయూ-7029, ఎంటీయూ1318, ఎంటీయూ-3291, ఎంటీయూ-1262, ఎంటీయూ-1061, ఎంటీయూ-1064 రకాలు ఉన్నాయి. ఇవన్నీ కామన్ రకాలు. ఆయా రకాలు అన్నీ 30 కేజీల బ్యాగుకు రూ.1260 అవుతుంది. రూ.150 ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నది.

2 లక్షల ఎకరాల్లో సాగు

పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 5 వేల 120 ఎకరాల్లో గత ఖరీఫ్‌లో సాగు చేశారనిని జిల్లా వ్యవసాయాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు చెప్పారు. వచ్చే ఖరీఫ్‌లో కూడా 2 లక్షల 8 వేల ఎకరాలు సాగులోకి వస్తుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. రైతులు అవసరమైన విత్తనాలు ఏపీ సీడ్స్ నుంచి పొందవచ్చని తెలిపారు.

పూర్తిస్థాయిలో విత్తనాలు

రైతులకు అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా అధికారులు ఇండెంట్ కన్నా అదనంగానే ఉన్నాయి. కాబట్టి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విత్తనాలు పొందవచ్చు. సంబంధిత వ్యవసాయ అధికారులు నుంచి పత్రాలు తీసుకొచ్చి విత్తనాలు పొందవచ్చు.

- జె.అనిత, జిల్లా మేనేజర్, ఏపీ సీడ్స్ తణుకు

డేంజర్ జోన్‌లో పిల్లలు



తాడేపల్లిగూడెంలో పాలిటెక్నిక్ చదువుతున్న యువకుడు తన స్నేహితులతో కలిసి ఒక గ్రూప్‌గా ఏర్పడి ఫ్రీ ఫైర్ గేమ్ గంటల తరబడి ఆడుతున్నాడు. చివరికి రాత్రి సమయంలో కూడా ఆ గేమ్ ఆడుతూనే ఉన్నాడు. ఇదేంటని గమనించి ఆ యువకుడి తండ్రి మందలించడంతో ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఆ తల్లిదండ్రులు ఆ యువకుడి కోసం గాలించగా స్నేహితుడి ఇంట్లోనే ఉంటూ అక్కడ కూడా అదే గేమ్ ఆడుతూ రెండు రోజులు ఉండిపోయాడు. ఇదేంటి అని ప్రశ్నిస్తే చచ్చిపోతానని బెదిరించాడు. దీంతో ఆ తల్లిదండ్రులు చేసేది లేక ఆ యువకుడిని బుజ్జగించి ఇంటికి తీసుకెళ్లారు. తరువాత మానసిక వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లి ట్రీట్‌మెంట్ తీసుకున్నారు.

పెనుగొండలోని ఓ యువకుడు ఆన్‌లైన్ గేమింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్నాడు. చేసేదేమి లేక తనలో తాను మదన పడిపోతూ ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా తల్లిదండ్రులు గమనించి అడ్డుకున్నారు. ఎందుకు ఇలా చేశావని ఆరా తీయగా అసలు విషయం బయట పడింది. దీంతో గేమ్‌ల కోసం చేసిన అప్పులు తీర్చారు.

ఆన్‌లైన్ గేమ్‌లతో భవిష్యత్ ప్రశ్నార్థకం

నిరంతరం ఫోన్లతో కాలక్షేపం

శారీరక శ్రమ లేక ఒత్తిడి..

అనారోగ్య సమస్యలు

తాడేపల్లిగూడెం రూరల్ ,మే 21 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు ఆటవిడుపు అంటే గతంలో క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ తదితర క్రీడలు ఉండేవి. కానీ ప్రస్తుతం అంతా ఫోన్‌లలోనే... ముందు కాస్త సరదాగా ప్రారంభించే క్రీడలు తరువాత వ్యసనంగా మారి ఆ ఆటలే సర్వస్వం అన్న స్థాయికి చేరుకుంటారు. ఏ స్థాయిలో అంటే ఆ క్రీడల కోసం ఎంతకైనా తెగించాలన్న మనస్తత్వం పెరిగిపోతుంది. అంత తీవ్ర స్థాయిలో ఉన్న వారిని వారించాలంటే ఎవరి తరం కాదు. చివరికి ఆ ఆటలు వారి ప్రాణాల మీదకు కూడా తెచ్చే విధంగా పరిణమిస్తున్నాయి.



బలవన్మరణాలు..అనారోగ్య సమస్యలు

ఆన్‌లైన్ గేమింగ్స్‌తో పిల్లలు తెలిసీ తెలియక డబ్బులు కూడా పోగొట్టుకునే పరిస్థితులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో యూట్యూబ్ ఇన్‌ఫ్లూయన్సర్లు చేస్తున్న ప్రచారంతో సరదాగా ఆడదాంలే అని బెట్టింగ్ యాప్‌లోకి అడుగు పెడుతున్నారు. డబ్బులు పోగొట్టుకుని చాలామంది తల్లిదండ్రులకు చెప్పుకోలేక, ఆ అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. గంటల తరబడి ఆన్‌లైన్ గేమ్స్‌లో మునిగిపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నమవు తున్నాయి. కంటి చూపు మందగించడం, ఎక్కువసేపు ఒకోచోట కూర్చుని ఉండడం వల్ల స్పాండిలైటిస్, ఫోన్‌లో ఉంటూ ఎంత తింటున్నామో తెలియకుండా తినడం వల్ల ఊబకాయంతో పాటు ఒత్తిడికి గురవుతున్నారు.

• పిల్లలతో అలవాటు మాన్పించాలి..



పిల్లలు ఎక్కువగా ఫోన్‌లు వినియోగించకుండా వారి అలవాటు క్రమేపీ మాన్పించేలా తల్లిదండ్రులే ప్రయత్నించాలి. పాఠశాలలో ఉన్నంత సేపు పిల్లల్ని ఎంత ఉపాధ్యాయులు ఎంత కంట్రోల్‌గా ఉంచుతారో క్లాసులు ముగిసిన తరువాత కూడా వారి అలవాట్లు మాన్పించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచి పుస్తకాలు చదివేలా అలవాటు చేయాలి. లేదంటే మనమే మంచి కథల పుస్తకాలు చదివి వినిపించడం ద్వారా వారి ఆలోచనలు మాన్పించాలి.

- బి.రాజారావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, పెదతాడేపల్లి

వారి దృష్టిని మరల్చాలి



పిల్లలకు అన్ని సమయాల్లోనూ మంచి అలవాట్లు చేయడం మన ధర్మం. కానీ వారిని అన్నం తినిపించడం దగ్గర నుంచి టీవీల నుంచి మరల్చడం వరకూ తల్లిదండ్రులే ఫోన్‌లు అలవాటు చేస్తున్నారు. వాటి వల్ల మెటబాలిజం దెబ్బతినడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. వాటిని అధిగమించడానికి తల్లిదండ్రులు పిల్లల్ని శారీరక శ్రమ కలిగించే క్రీడల వైపు మళ్లించడం ద్వారా వారు సమయానికి ఆహారం తింటూ మంచినీరు తాగుతూ చదువులో కూడా ఉత్సాహంగా ఉండేందుకు వీలుంటుంది.

- నార్ని బావాజీ, వైద్యుడు, తాడేపల్లిగూడెం

• పిల్లల అలవాట్లకు మనమే కారణం



పిల్లలు ఫోన్‌లు చూస్తున్నారన్నా అదేపనిగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారన్నా దానికి మనమే కారణం. పిల్లల అభిరుచుల్ని తెలుసుకుని స్కూల్ అయిన తరువాత డ్యాన్స్ , ఇతర క్రీడల్లో శిక్షణ వంటివి ఇప్పిస్తే వారి దినచర్య మారిపోతుంది.

- ఎం.నాగరాజు, తాడేపల్లిగూడెం



ప్రమాదానికి గురైన బస్సు నుంచి క్షతగాత్రులకు సహాయక చర్యలు

వరుసగా ఢీకొన్న మూడు బస్సులు

- ఎనిమిది మందికి గాయాలు

భీమడోలు, మే 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై భీమడోలు కనకదుర్గమ్మ ఆలయ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి మూడు ట్రావెల్స్ బస్సులు వరుసగా ఒక దానినొకటి వేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌లో చిరుద్యోగాలు చేసుకుంటున్న 8 మంది గాయపడ్డారు. జాతీయ రహదారిపై బస్టాండ్ సమీపంలో ఆగి ఉన్న లారీని మినీ వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. వ్యాన్‌లో డ్రైవర్ భార్య ఇరుక్కుపోవడంతో బయటకు తీసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లించేందుకు కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో డివైడర్ వద్ద ట్రాఫిక్ కోన్ ఉంచారు. అర్ధరాత్రి సమయంలో తూర్పుగోదావరి జిల్లా నుంచి హైదరాబాద్ వెళుతున్న మూడు ప్రైవేటు ట్రావెల్ బస్సులు ట్రాఫిక్ కోన్‌లు ఉంచిన చోట ఒకదానిని ఒకటి వెనక నుంచి వేగంగా ఢీకొన్నాయి. మూడు బస్సుల్లో సుమారు 120 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారిలో ఎనిమిది మందికి స్వల్పగాయాలయ్యాయి. వారంతా హైదరాబాద్‌లో చిన్నపాటి ఉద్యోగాలు చేసుకుంటారని పోలీసులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రామారావు (ద్రాక్షారామం), కొటింగ నాగరాజు (రావులపాలెం), కొటింగ మీరమ్మ (రావులపాలెం), పెద పట్నం బాపన్న (మామిడి కుదురు), విత్తనాల నాగరాజు (అమలా పురం), పేసినకుర్తి కంటిబాబు (హైదరాబాద్), విత్తనాల దీపక్‌కుమార్ (హైదరాబాద్) గాయపడ్డారు. వారిని బస్సు నుంచి బయటకు తీసి ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు భీమడోలు పోలీసులు తెలిపారు.

ఒకే చోట.. ఐదు నెలల్లో ఐదుగురి మృతి

జాతీయ రహదారిపై భీమడోలు వద్ద డివైడర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ ఐదు నెలల్లో జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. 31 మంది తీవ్రంగా గాయపడినట్లు పోలీసు నివేదికలు చెబుతున్నాయి. ఏలూరు-కొవ్వూరు జాతీయ రహదారి, ఏలూరు-తాడేపల్లి గూడెం జాతీయ రహదారిపై డివైడర్ల సమీపంలో ప్రమాదాలు నిత్య కృత్యం అయ్యాయి. ప్రమాదాల నివారణకు అధికారులు, పోలీసులు నామమాత్రపు చర్యలతో చేతులు దులిపేసుకుంటున్నారు. భీమడోలు కనకదుర్గమ్మ ఆలయ సమీపంలో డివైడర్, అయ్యప్పస్వామి ఆలయం, కురెళ్లగూడెం, పూళ్ల, కోడూరుపాడు, పి.కన్నాపురం రైల్వే గేటు, కొండ్రెడ్డినగర్, పోలసానపల్లి బ్రిడ్జి ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి పోలీస్, రవాణా, ఆర్ అండ్ బి శాఖాధికారులు చర్యలు చేపడుతున్నారు.. ప్రమాదాలు జరుగుతున్నాయి.. ప్రాణాలు పోతున్నాయి.. విధి నిర్వహణలో అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబాలతో పాటు అన్ని వర్గాల ప్రజలు వేలెత్తి చూపుతున్నారు. ప్రధానంగా 16వ నెంబర్ జాతీయ రహదారి హనుమాన్ జంక్షన్ నుంచి గుండుగొలను వరకూ 40 కిలోమీటర్ల పరిధిలో అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయి. 8 బ్లాక్ స్పాట్స్ గుర్తించారు. డేంజర్ జోన్‌గా ప్రకటించారు. ప్రమాదాలు మాత్రం ఆగడం లేదు. ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అనేక మంది దివ్యాంగులై భారంగా బతుకీడుస్తున్నారు. నిరంతరం ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు పరిశీలించినా.. చర్యలు మాత్రం శూన్యం.!

హైవేపై బ్లాక్ స్పాట్స్

- తాళ్లమూడి బ్రిడ్జి
- వట్లూరు
- అమ్మపాలెం క్రాస్‌రోడ్డు
- రత్నాస్ హోటల్
- ఆశ్రం జంక్షన్
- పున్నమి హోటల్ ప్రాంతం
- సత్యనారాయణపురం
- గుండుగొలను సెంటర్

కనబడని హైవే పెట్రోలింగ్ వాహనాలు

హనుమాన్ జంక్షన్ నుంచి గుండుగొలను సెంటర్ వరకూ హైవే పెట్రోలింగ్‌కు మూడు వాహనాలను ఏర్పాటు చేశారు. గుండుగొలను సెంటర్, ఆశ్రం జంక్షన్, కలపర్రు టోల్‌గేటు ప్రాంతాల నుంచి వారి పరిధిలో గస్తీ నిర్వహించాల్సి ఉంది. 12 గంటల డ్యూటీ చొప్పున రెండు షిఫ్టులుగా పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రాత్రివేళ వాహన డ్రైవర్ల నిద్ర పోగొట్టడానికి పేష్‌వాష్, జాతీయ రహదారి వెంబడి హోటళ్లు, దాబాలను రాత్రి 11 గంటలలోపు మూయించడం, రహదారిపై వాహనాలను తీయించడం, వాహనం మరమ్మతుకు గురైతే ఎన్‌హెచ్‌ఎఐ సిబ్బంది సహకారంతో హెచ్చరిక బోర్డులు, రక్షణ చర్యలు చేపట్టడం, ప్రమాదాల్లో క్షతగాత్రులను హైవే అంబులెన్సులో ఆసుపత్రికి తరలించడం వారి విధులు. ప్రస్తుతం వాటి జాడే లేదు..!

ప్రమాదాల హైవే



- బ్లాక్ స్పాట్‌లు గుర్తించారు
- రక్షణ చర్యలు గాలికొదిలేశారు
- దూరప్రాంత ప్రయాణికులకు జాతీయ రహదారి మృత్యు మార్గం
- రహదారిపై మొబైల్ క్యాంటిన్లు
- భారీ వాహనాల నిలుపుదల
- పోలీసులకు మామూళ్ల మత్తు
- అధికారులు పట్టించుకోరు

అధికారుల నిర్లక్ష్యం

ఏలూరు క్రైం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 581 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 1500 మంది గాయపడ్డారు. ఎక్కువ మంది 16వ నెంబర్ జాతీయ రహదారిపైనే మృత్యువాత పడ్డారు. బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతాయని స్థానికులకు పూర్తిస్థాయిలో అవగాహన లేదు. ఇతర రాష్ట్రాల నుంచి లారీలు, కార్లు, బస్సులతో వచ్చే వారికి ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతాయని ఎలా తెలుస్తుందని ప్రశ్న. గతంలో బ్లాక్ స్పాట్స్ ఉన్న ప్రాంతంలో 500 మీటర్ల దూరం నుంచే ప్రతి వంద మీటర్లకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేసి వాహన డ్రైవర్లను అప్రమత్తం చేసేవిధంగా చర్యలు చేపట్టారు.

రికార్డులకే పరిమితం..

ప్రస్తుతం అధికారుల రికార్డులకు మాత్రమే బ్లాక్ స్పాట్స్ నమోదు చేసుకుంటున్నారే తప్ప హైవే పెట్రోలింగ్ పోలీసులు ఈ ప్రాంతాల్లో గస్తీ నిర్వహించిన దాఖలాలు లేవు. సాధారణంగా రోడ్డు ప్రమాదాలు తెల్లవారుజామున, మధ్యాహ్నం, సాయంత్రం చీకటి

ఆగని మరణాలు

పడే సమయంలో జరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో బ్లాక్ స్పాట్స్ వద్ద పోలీసులు తగిన రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. జాతీయ రహదారిపై అనధికార హోటళ్లు, దాబాలు ఉండడంతో లారీలు, బస్సులు రహదారిపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఆగి ఉన్న లారీలను ఢీకొని మృతి చెందిన వారు ఎందరో. తగిన చర్యలు తీసుకోకపోవడంతో ఎంతోమంది ఇతర రాష్ట్రాల వారు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ప్రమాదాల్లో జిల్లాలోని పలువురు మృత్యువాత పడ్డారు. యజమానిని కోల్పోయిన కుటుంబాలు చిన్నాభిన్నం అయిపోయాయి. మరికొంత మంది అవయవాలు కోల్పోయి దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఉన్నతాధికారు తక్షణ చర్యలు చేపట్టి బ్లాక్‌స్పాట్స్‌లో హెచ్చరిక బోర్డులను తక్షణ చర్యలు ఏర్పాటుచేసి ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో హైవే మొబైల్ పెట్రోలింగ్ పోలీస్ గస్తీ ముమ్మరం చేయాల్సి ఉంటుంది. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నియంత్రిస్తామని ప్రకటనలు చేసే ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



మొబైల్ క్యాంటీన్ వద్ద ఆగిన భారీ వాహనాలు

రహదారి వెంట మొబైల్ క్యాంటీన్లు!

జాతీయ రహదారి వెంట మొబైల్ క్యాంటీన్లను ఏర్పాటు చేయడంతో భారీ వాహనాలు రహదారిపై ఆపుతున్నారు. మొబైల్ పోలీసులు మామూళ్ల మత్తులో పట్టనట్లు వ్యవహరించడం ప్రమాదాలకు దారితీస్తోంది. గుండుగొలను నుంచి హనుమాన్ జంక్షన్ వరకూ 8 మొబైల్ క్యాంటిన్లు ఉండగా కేవలం దుగ్గిరాల బ్రిడ్జి నుంచి కలపర్రు టోల్‌గేట్ వరకూ 4 క్యాంటిన్లు ఉన్నాయి. అమ్మపాలెం క్రాస్ రోడ్డు మొబైల్ క్యాంటీన్ వద్ద రహదారిపై భారీ వాహనాలు నిలపడంతో ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి.



క్యాంటీన్ వద్ద కార్ల క్యూ



తిరంగా ర్యాలీలో జాతీయ జెండాలతో నాయకులు, నియోజకవర్గ ప్రజలు

200 మీటర్ల జాతీయ జెండా

పాలకొల్లులో తిరంగా యాత్ర

మంత్రి నిమ్మల ఆధ్వర్యంలో పాల్గొన్న ప్రజలు

పాలకొల్లు అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): సింధూర్ ఆపరేషన్ విజయవంతమైన సందర్భంగా పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో బుధవారం తిరంగా యాత్ర నిర్వహించారు. మంత్రి నిమ్మల ఇచ్చిన పిలుపుతో వేలాది నాయకులు, ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. ఎడ్ల బజారులో ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా గాంధీ బొమ్మల సెంటర్ వరకూ సాగింది. 200 మీటర్ల పొడవైన జాతీయ జెండాతో జయహో భారత్ నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. మంత్రి నిమ్మల మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనలతో సంఘీభావంగా తిరంగా ర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. ర్యాలీలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ కూటమి నాయులు జీవీ, పెచ్చెట్టి బాబు, కర్నేని రోజారమణి, గౌరు నాయుడు, కోడి విజయభాస్కర్, పి.రజని, కడలి గోపి, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, ఎం.పెద్దిరాజు, ఉన్నమట్ల కపర్ది, వై పద్మారావు, టి.రామలింగం, సురేంద్ర, లక్ష్మీనారాయణ, విన్నకోట గోపి, ఆర్వి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నరసాపురం-కాకినాడ రైలు

- చినమామిడిపల్లి వద్ద వంతెన
- లింగంపల్లికి అదనపు జనరల్ బోగీ
- డీఆర్ఎం నరేంద్ర పటేల్

నరసాపురం, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాకు రైల్వే డీఆర్ఎం వరాలు కురిపించారు. రైల్వే సలహా కమిటీ జిల్లా సమావేశం విజయవాడలో బుధవారం జరిగింది. సమావేశంలో నరసాపురం, పాలకొల్లు నుంచి పాల్గొన్న కమిటీ సభ్యులు జక్కంపూడి కుమార్, నడిపూడి పండు వివరాలు తెలిపారు. త్వరలో నరసాపురం నుంచి కాకినాడకు కొత్తగా రైలు నడపనున్నారు. వయా భీమవరం, తణుకు, నిడదవోలు మీదుగా ఈ రైలు నడుస్తుందన్నారు. ప్రయాణికుల రద్దీని పరిగణలోకి తీసుకుని ఈ రైలు సర్వీసును ప్రకటించినట్లు వారు చెప్పారు. లింగంపల్లి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల డిమాండ్‌ను గుర్తించి అదనంగా మరో జనరల్ బోగిని కేటాయించారన్నారు. త్వరలో దీన్ని అమల్లోకి తీసుకురానున్నారు. ఇక చినమామిడపల్లి గేటు మూసివేతతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని సమావేశంలో చర్చించామన్నారు. ఈ ప్రాంతంలో అండర్‌గ్రౌండ్ టన్నెల్ వేసేందుకు అవకాశం లేదని, దీనికి రైల్వే మట్టి పరీక్షలు కూడా జరిపినట్లు డీఆర్ఎం వెల్లడించారన్నారు. ప్రజల ఇబ్బందుల్ని గుర్తించి ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఫుట్‌పాత్ వంతెనను నిర్మిస్తామని హామీ ఇచ్చినట్లు కుమార్, పండు తెలిపారు.

లాభసాటి వ్యవసాయం ప్రభుత్వ లక్ష్యం

- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రత్యేకాధికారి అజయ్ జైన్

ఉండి, మే 21(ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో రైతులకు లాభసాటి వ్యవసాయం అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా ప్రత్యేకాధికారి, గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ అన్నారు. ఉండి మండలం మహదేవపట్నం గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. పశ్చిమ గోదావరి జిల్లా ధాన్యాగారానికి పుట్టినిల్లు అన్నారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని, ఎస్సీ పేటలో లేఅవుట్లు, గ్రామసచివాలయం, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. లాభసాటి వరి వంగడాలు అందించడానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు నిరంతరం కృషిచేయాలని సూచించారు. పరిశోధనలను విస్తృతం చేసి రైతులకు మేలైన వరి, హార్టికల్చర్ వంగడాలను అందించాలని సూచించారు. మిల్లెట్‌ల సాగు, అంతర పంటల సాగుపై రైతులలో అవగాహన కల్పించాలని సూచించారు. మహదేవపట్నంలో డంపింగ్‌యార్డు పరిశీలించి సర్పంచ్ వెంకట సుబ్బలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తాళ్లకోడు కాలనీ సమస్యలపై దృష్టి

ఆకివీడు రూరల్: తాళ్లకోడు కాలనీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రత్యేకాధికారి అజయ్ జైన్ అన్నారు. కుప్పనపూడిలోని తాళ్లకోడు ఇళ్ల స్థలాలను ఆయన పరిశీలించారు. కాలనీలో సుమారు 950 మంది ఇళ్లు నిర్మాణం పూర్తిచేసుకుని నివసిస్తున్నారు. మరో 1400 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. తాగునీరు, డ్రెయినేజీ, రోడ్లు, వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆకివీడు పట్టణానికి చెందిన తమకు ఈ ఊరిలో స్థలం ఇచ్చారన్నారు.



భీమవరం పట్టణంలో క్షేత్రస్థాయి పర్యటనలో ప్రత్యేకాధికారి అజయ్ జైన్, కలెక్టర్, జేసీ

భీమవరం పట్టణ పర్యటన

భీమవరం టౌన్: పట్టణంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రత్యేకాధికారి అజయ్ జైన్ పర్యటించారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు తీరును పరిశీలించడానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గునుపూడిలో అంగన్‌వాడీ కేంద్రం సందర్శించి పిల్లలకు పౌష్టికాహార లోపం లేకుండా చూడాలన్నారు. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడంపై శ్రద్ధ చూపాలన్నారు. ఆయన వెంట కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, డ్వామా పీడీ అప్పారావు, గృహ నిర్మాణ శాఖ పీడీ జి.పిచ్చియ్య, డీఎల్‌డీవో దోసిరెడ్డి, సర్పంచ్‌లు వనిమా సుబ్బలక్ష్మి, ముత్యాల అనూరాధ, మోటుపల్లి రామవరప్రసాద్, ముత్యాల రత్నం, గొంట్లా గణపతి, బొల్లా వెంకట్రావు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టీ పెట్టిన అజయ్ జైన్

భీమవరం పట్టణం దుర్గాపురంలో దీపం పథకం లబ్ధిదారు ఇంట్లో అజయ్ జైన్ దీపం స్వయంగా టీ తయారుచేశారు. తాను పెట్టిన టీ దీపం లబ్ధిదారుతో పాటు జిల్లా అధికారులకు అందించి ఆశ్చర్యం కలిగించారు. కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్ కుమార్ రెడ్డి టీ బాగుందని అభినందించారు. పేద మహిళలకు ఆర్థిక ప్రయోజనం సమకూర్చేందుకు ప్రభుత్వం దీపం పథకాన్ని ప్రవేశపెట్టిందని, సంవత్సరానికి మూడు సిలిండర్లను ఉచితంగా అందజేస్తుందన్నారు.



పాఠశాలలో క్రైస్తవ ప్రార్థన ఏర్పాట్లు చేసిన దృశ్యం

పాఠశాల ఆవరణలో మత ప్రార్థనలు

అభ్యంతరం చెప్పిన యువకులపై దాడి



విద్యుత్ అక్రమ వినియోగం



దాడిలో గాయపడిన శ్రీహరి

నూజివీడు మే 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల ఆవరణలో క్రైస్తవ మత ప్రార్థనల ఏర్పాటుపై ప్రశ్నించిన యువకులపై దాడి సంఘటన నూజివీడు మండలం దిగవల్లిలో చర్చనీయాంశమైంది. ఎంపీపీ పాఠశాలలో మంగళ, బుధవారాలలో క్రైస్తవ మత ప్రార్థనలను ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు పాఠశాలలో క్రైస్తవ మత ప్రార్థనలు నిర్వహించడం తగదని అభ్యంతరం తెలుపుతూ వీడియో చిత్రీకరించబోయారు. దీంతో అక్కడ ఉన్న కొందరు వీడియో చిత్రీకరిస్తున్న సెల్ ఫోన్‌లను లాక్కుని యువకులపై దాడి చేశారు. గ్రామానికి చెందిన ఆకిరెడ్డి శ్రీహరి అనే యువకుడు గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎంపీపీ పాఠశాల ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా మత ప్రార్థన నిర్వహిస్తుండగా ఇదే ఆవరణలో అంగన్వాడి కేంద్రం కూడా నడుస్తుందని స్థానికులు తెలిపారు. ప్రార్థనలకు క్రైస్తవ పాస్టర్లు అక్రమంగా ఎలక్ట్రికల్ మీటర్ నుంచి విద్యుత్‌ను సైతం చౌర్యం చేయడం జరుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు

చేపల చెరువులో పనిచేస్తూ.. బోదెలో చేపలు పట్టుకుంటూ..

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

మాదేపల్లి, వెలివర్రులో విషాదం



తాతారావు మృతదేహం

ఏలూరు క్రైం, మే 21 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువు నుంచి ఫ్యాను తీసుకువెళుతుండగా ఇనప గొట్టం హైటెన్షన్ వైర్లకు తగలడంతో ఇద్దరు విద్యుదాఘాతానికి గురయ్యారు. ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామానికి చెందిన పెరుమాళ్ళ తాతారావు (52)కు భార్య భూలక్ష్మి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలకు వివాహాలు అయ్యాయి. తాతారావు గ్రామ సమీపంలోని లింగారావుగూడేనికి చెందిన మార్త శివ చేపల చెరువులో పనిచేయడానికి బుధవారం ఉదయం వెళ్లాడు. చెరువులో ఫ్యాన్లను తాతారావు, యజమాని మార్త శివ చెరోవైపు పట్టుకుని బయటకు తీస్తున్నారు. 20 అడుగుల పొడవు ఉన్న ఆ ఫ్యాన్ గొట్టం హైటెన్షన్ విద్యుత్ వైరుకు తగిలింది. దీంతో వారిద్దరూ షాక్‌నకు గురికాగా తాతారావు అక్కడికక్కడే మృతి చెందాడు. శివ తీవ్ర గాయాలకు గురికాగా ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్‌ఐ సీహెచ్. దుర్గా ప్రసాద్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తాతారావు మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పట్టుకోవడానికి వెళ్లి..

ఉండి, మే 21(ఆంధ్రజ్యోతి): చేపలు పట్టుకోవడానికి వెళ్లిన యువకుడుకు విద్యుత్ వైర్లు తగిలి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఉండి యానాదుల కాలనీకి చెందిన బొజ్జ రవి మరో యువకుడు కలిసి బుధవారం మండలంలోని వెలివర్రులోని పంట బోదెలో చేపలు పట్టుకోవడానికి వెళ్లారు. పంట బోదెలోకి దిగడానికి వెళుతున్న రవి ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో షాక్ తగిలింది. అతడు కేకలు వేయడంతో మరో యువకుడు పరుగున వెళ్లి స్థానికులకు సమాచారం ఇచ్చాడు. పలువురు కర్రల సాయంతో పైకి తీశారు. అప్పటికే యువకుడు మృతిచెందడంతో స్థానికులు కన్నీరుపర్యంతమయ్యారు. రవికి భీమవరం లంకపేటకు చెందిన మావుళ్లుతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వారికి ఒక బాబు వున్నాడు. సంఘటనా ప్రాంతాన్ని విద్యుత్ అధికారులు, పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నజీరుల్లా తెలిపారు.

వృద్ధురాలిపై మనవడి దాడి

అక్కడికక్కడే మృతి

భీమవరం క్రైం, మే21 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై మనవడు దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిన ఘటన భీమవరం మండలం రాయలంలో బుధవారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలను సీఐ కాళీచరణ్ వెల్లడించారు. భూదేవి తోటలో కర్రి మాణిక్యం (79) కూతురి ఇంటి వద్ద ఉంటుంది. బుధవారం ఉదయం మాణిక్యం కుమార్తె మనుమరాలు వాకిట్లో మొక్కలు పీకుతుంది. ఆ బాలికను కేకలు వేయడంతో అక్కడే ఉన్న మాణిక్యం మనుమడు తోట మధు మా అన్నయ్య కూతురిని ఎందుకు కేకలు వేస్తున్నావంటూ గొడవపడ్డాడు. దీంతో కోపోద్రిక్తుడైన తోట మధు వృద్ధురాలిపై చేత్తో దాడి చేశాడు. తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం మధు సోదరుడు, తల్లిపై కూడా దాడి చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కాళీచరణ్ తెలిపారు. అయితే నిందితుడు మధు పోలీసుల అదుపులో ఉన్నట్లుగా సమాచారం.

భార్యా పిల్లలు దూరమయ్యారని..

పురుగు మందు తాగేశాడు

జంగారెడ్డిగూడెం, మే 21 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి భార్యా పిల్లలు తన నుంచి దూరమై వేరే చోట ఉండడంతో మనస్తాపంతో జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన బోయిన నాని (38)మద్యంలో పురుగుమందు కలుపుకుని తాగి మృతి చెందాడు. మృతుడి తల్లి బోయిన సుభద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. వేగవరం గ్రామానికి చెందిన బోయిన నాని(38) కి పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. నాని తరచూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడుతుండేవాడు. దీంతో భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నెల 20న మద్యం తాగి వాంతులు చేసుకుంటుండగా అతని తల్లి పురుగు మందు వాసన రావడం గమనించింది. కుమారుడు నానిని ప్రశ్నించగా భార్యా పిల్లలు దూరమైన కారణంగా మనస్తాపంతో మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగినట్లు చెప్పాడు. వెంటనే స్థానికుల సహకారంతో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

కడుపు నొప్పితో ఒకరు..

తల్లి మందలించిందని ఒకరు..

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరి మృతి

కామవరపుకోట, మే 21 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు సంఘటనల్లో పురుగుల మందు తాగి ఇద్దరు మృతి చెందినట్టు తడికలపూడి ఎస్‌ఐ పి.చెన్నారావు బుధవారం తెలిపారు. తడికలపూడి గ్రామానికి చెందిన చిరుగుబత్తుల రాంబాబు(57) కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి కొద్దిసేపటికే ఇంటి వద్ద మృతి చెందాడు. వీరంపాలెం గ్రామానికి చెందిన కొమ్మంటి మహేష్(24) ఫోన్ ఎక్కువగా వాడుతున్నావని తల్లి మందలించడంతో పురుగుల మందు తాగాడు. అనంతరం చికిత్స పొందుతూ ప్రభుత్వాసుపత్రిలో మహేష్ మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ



టి.నర్సాపురం, మే21(ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైభవంగా అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి ఆశీస్సులు అందుకున్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగపాలెం, మే 21(ఆంధ్రజ్యోతి) : మండలంలో ధర్మాజీగూడెం, రంగాపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో గురు, శుక్రవారాల్లో ఉదయం9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు. ధర్మాజీగూడెం, రంగాపురం సబ్ స్టేషన్‌ల పరిధిలో మరమ్మతులు, కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటు నేపథ్యంలో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జిల్లాకు అంబేడ్కర్ వర్సిటీ మణిహారం : మంత్రి సారథి

ఏలూరు, మే 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శుభపరిణామం అని, ఏలూరు జిల్లాకు ఇది మణిహారంగా నిలుస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. కొంత మంది విద్యార్థులు కొన్ని కారణాలతో విద్యను మధ్యలోనే నిలిపివేసిన వారు ఈ యూనివర్సిటీ ద్వారా దూరవిద్యను అభ్యసించి తమ విద్యను కొనసాగించుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. అంబేడ్కర్ యూనివర్శిటీ ద్వారా దూర విద్యను అభ్యసించి డిగ్రీలు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనివర్సిటీ ఏర్పాటును కేబినెట్ ఆమోదించడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు

ఏలూరు సిటీ, మే 21(ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో బుధవారం కూడా భారీగానే వర్షాలు కురిశాయి. కైకలూరు నియోజకవర్గంలోని మండలాలతో పాటు జిల్లాలోని జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కుక్కునూరు, పోలవరం, ఉంగుటూరు, ద్వారకాతిరుమల తదితర ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. జిల్లాలో పలు చోట్ల భారీగా వర్షాలు కురవగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మేఘాలతో మబ్బులు కమ్మేశాయి. ఏజెన్సీలో, కైకలూరు నియోజకవర్గ వ్యాప్తంగా వర్షం కురిసింది. మరో రెండ్రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా పోలవరం మండలంలో 13 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి 1.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మండలానికో పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

చింతలపూడి, మే 21(ఆంధ్రజ్యోతి) : మండలానికో పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్ది మిగిలిన పంచాయతీలకు ఆ ప్రగతిని చూపాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. వీకేఎం ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ పంచాయతీల కార్యదర్శుల సమీక్షా సమావేశం జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.జిల్లా పంచాయతీ అధికారి అనూరాధ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పంచాయతీ కార్యదర్శులు పనిచేయాలన్నారు. చింతలపూడి, లింగపాలెం మండలాల్లో డేటా నమోదు సక్రమంగా లేదని, కొద్ది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జంగారెడ్డిగూడెం డీఎల్పీవో, కూటమి నాయకులు జె.ముత్తారెడ్డి, ఎం.వెంకట్రామయ్య, ప్రసాద్, వరప్రసాద్, మధుబాబు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడమే పీఎంఏజేఏవై లక్ష్యం

ఏలూరు రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్ కులాల వారికి ఉపాధి కల్పించడం, పేదరికాన్ని తగ్గించడమే ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన(పీఎంఏజేఏవై) ముఖ్య ఉద్దేశమని నాక్ డిప్యూటీ డైరెక్టర్ పి.మురళీధర్ తెలిపారు. బుధవారం చోదిమెళ్ల గ్రామంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో నాక్(ఎన్ఏసీ) ఆధ్వర్యంలో స్వయం ఉపాధి టైలరింగ్ మూడు నెలల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణలో 30 మంది మహిళలు పాల్గొన్నారు. మురళీధర్ ఈ శిక్షణ ఉపయోగాలు, ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వసంతరావు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్లేస్మెంట్ ఆఫీసర్ కె.ప్రవీణ్, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పోలవరం ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలి'

బుట్టాయగూడెం, మే 21(ఆంధ్రజ్యోతి) : పోలవరం ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి పార్టీల ఎన్నికల హామీలో భాగంగా పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాలను కలుపుకుని పోలవరం, రంపచోడవరం, చింతూరు, కుక్కునూరు డివిజన్లను కలుపుకుని కోటరామచంద్రపురం కేంద్రంగా నూతన జిల్లాను ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ చట్టాలు అమలు జరగాలన్నా గిరిజన జీవన స్థితిగతులు మెరుగుపడాలన్నా, ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయింపులు అవసరమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సుధాకర్ డిమాండ్ చేశారు.

శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చు

ఏలూరు క్రైం, మే 21(ఆంధ్రజ్యోతి) : శుభ్రత పాటించడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని ఏలూరు చర్మవ్యాధుల వైద్యనిపుణులు డి.సుబ్బారావు ఖైదీలకు సూచించారు. ఏలూరు జిల్లా జైలులో హేలాపురి ఛాలెంజర్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రిమాండ్ ఖైదీలకు శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరం కావచ్చన్నారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ సి.హెచ్.స్వామి మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పు చేసి రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, వారి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాన్ అఫీషియల్ విజిటర్స్ కూనా కృష్ణారావు, ఎల్.వెంకటేశ్వరరావు, జైలర్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అటవీ రేంజ్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సమస్యలపై అటవీ శాఖ అధికారులకు వినతి

ఏలూరు రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వన సంరక్షణ సమితులలో పని చేస్తున్న కూలీలకు వేతన బకాయిలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం అటవీ శాఖ జిల్లా ఏలూరు రేంజ్ అధికారి కుమార్‌కు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కమిటీ బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గిరిజనులు, పేదలు అడవికి వెళ్లి తునికాకు కోసి ఎండబెట్టి 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి రాష్ట్రం విడిపోయినాటి నుండి నేటికీ తునికాకు బోనస్ బకాయిలు చెల్లించలేదన్నారు. ఏలూరు రేంజ్ కుమార్ మాట్లాడుతూ పేదల పక్షాన అటవీ శాఖ అధికారులు నిక్కచ్చిగా పనిచేయాలని సూచిస్తామనిసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

రేషన్ పంపిణీ వాహనాల రద్దుపై డీలర్లు హర్షం



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘ సభ్యులు

ఏలూరు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : రేషన్ పంపిణీ వాహనాలను రద్దు చేసి మళ్లీ చౌక ధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ చేయాలన్న రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయంపై ఏలూరు జిల్లా రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజులపాటి గంగాధర్‌రావు, నాయకులు హర్షం ప్రకటించారు. ఈమేరకు బుధవారం ఏలూరు తహశీల్దార్ శేషగిరి, పౌరసరఫరాల డిటీ కే రమేష్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హర్షం ప్రకటించారు.

నేడు నూజివీడులో టీడీపీ జిల్లా మినీ మహానాడు

(ఐదో పేజీ తరువాయి)

ఏఎంసీ మార్కెట్ యార్డులో గురువారం నిర్వహించే మినీ మహానాడుకు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలన్నారు. మహానాడు ఏర్పాట్లకు సంబంధించి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి మండల అధ్యక్షులు, గ్రామపార్టీ, బూత్‌కమిటీ అధ్యక్షులు, క్లస్టర్ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు భారీగా తరలి వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా ఆ మేరకు చర్యలు చేపట్టాలన్నారు. నూజివీడు నియో జకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి చర్చించి తీర్మానాలు చేపట్టాలని, మెజార్టీ కార్యకర్తల నిర్ణయం మేరకే మండల పార్టీ నాయకుల ఎంపిక జరుగుతుందన్నారు. మాజీ నూజివీడు ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, ముసునూరు మండల టీడీపీ అధ్యక్షుడు దేవినేని బలరామ్, నూజివీడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, ఆరేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్యకర్తలే టీడీపీకి బలం

దెందులూరు మినీ మహానాడులో మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే చింతమనేని - భారీగా హాజరైన పార్టీ కేడర్



సభలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

దెందులూరు, మే 21(ఆంధ్రజ్యోతి) : టీడీపీకి కార్యకర్తలే బలమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో టీడీపీ మినీ మహానాడును మంత్రి కొలుసు పార్థసారథి, దెందులూరు నియోజకవర్గ పరిశీలకులు చెన్ను గాంధీ, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ సామాన్య కార్యకర్తలకు టీడీపీ ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తుందని, పార్టీ అభివృద్ధి, సంక్షేమానికి అంతా కలిసి పని చేయాలన్నారు. మినీ మహానాడు వేదికపై నుంచి నాయకులు జెండా ఊపి కార్యకర్తల్లో ఉత్తేజం నింపారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 90 శాతం మండల, గ్రామ కమిటీలను ఏకగ్రీవం చేసినట్టు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ త్వరలో నూతన రేషన్ కార్డులు అందిస్తామని, ఇళ్లు లేని పేదలకు స్థలం మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షులు ఈడ్పుగంటి అనిల్, మరడాని రవి, మాగంటి నారాయణ ప్రసాద్, నంభూరి నాగరాజు, మండల కార్యదర్శి నాగనబోయిన సత్యనారాయణ, మోతుకూరి నాని, వీరమాచినేని ప్రభాకర్, తాతా సత్యనారాయణ, బొప్పన సుధా, మోరు శ్రావణి, రాంప్రసాద్, గారపాటి కొండయ్య చౌదరి, ఇప్పిలి వెంకటేశ్వరరావు, ఎం.సురేంద్రనాథ్ చౌదరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఏఎంసీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి సారథి, ఎమ్మెల్యే చింతమనేని - తరలివచ్చిన నాయకులు



రామసీతను అభినందిస్తున్న మంత్రి సారథి, ఎమ్మెల్యేలు

దెందులూరు, మే 21(ఆంధ్రజ్యోతి) : గత పాలనను వైసీపీ ప్రభుత్వం అవినీతిమయం చేస్తే, టీడీపీ కూటమి ప్రభుత్వం అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తోందని ఏపీ గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. దెందులూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పెదపాడు మండలం కొక్కిరపాడు(వెంపాడు) గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ గారపాటి రామసీత, వైస్ చైర్మన్‌గా విజయరాయి గ్రామానికి చెందిన దారిబోయిన సత్యనారాయణల చేత ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మంత్రి సార్థసారథి ప్రమాణ స్వీకారం చేయించారు. డైరెక్టర్లుగా బాలిన కుమారి(రామారావుగూడెం), మద్దా దయానందరాజు (గాలాయగూడెం), పుసులూరి బాల వెంకట సత్యప్రసాద్(చల్లచింతలపూడి), వైవాక సత్యనారాయణ (రాజా)(సీతంపేట), అల్లు జ్యోతి (సోమవరప్పాడు), చందు రంగజావని, దొర్రాజు భ్రమర కుమారి, గారపాటి రామకృష్ణ, మత్తే కుసుమ కుమారి, పసుపులేటి శ్రీరామభార్గవ కృష్ణ, పెదపూడి వెంకట సుజాత లక్ష్మి, షేక్ మౌలాలి, మేదారపు శ్రీనివాస్, లక్ష్మీపురం సర్పంచ్ మేకా కనకరాజు, వ్యవసాయ శాఖ ఏడీ, జిల్లా వ్యవసాయ మార్కెట్ శాఖ అధికారి విప్పర్తి మహేంద్రనాథ్, పెదవేగి ప్రత్యేకాధికారి కె.ఎస్.మూర్తిల చేత ఎమ్మెల్యే చింతమనేని, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎండీ శ్రీనివాస్, టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, దెందులూరు నియోజకవర్గ పరిశీలకులు చెన్ను గాంధీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ కిశోర్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరి శోభన్ బాబు (నాని), మండలాధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, వీరమాచినేని ప్రభాకర్, తాత సత్యనారాయణ, ఉప్పలపాటి రామ్‌ప్రసాద్, ఈడ్పుగంటి అనిల్, మరడాని రవి, నంభూరి నాగరాజు, బొప్పన సుధాకర్, గారపాటి కొండయ్య చౌదరి, ఇప్పిలి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మోరు శ్రావణి పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న గన్ని

ఉంగుటూరు, మే 21(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు జన్మదిన వేడుకలు బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. అభిమానులు, జనసేన కార్యకర్తలు, వీర మహిళలతో పాటు వివిధ శాఖల అధికారులు పుష్ప గుచ్ఛాలు, నోట్ పుస్తకాలు బహుమతిగా ఇచ్చి అభినందించారు. ఈసందర్భంగా టి.డి.పి. జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ జడ్పీటీసీ చింతల శ్రీనివాస్, టీడీపీ మండలాధ్యక్షులు వేములపల్లి సుధీర్ పార్టీ నేతలతో కలిసి పత్తేపురానికి చెందిన పొత్తూరి హరి వేణు గోపాల రాజు, గణేశ్ వర్మలు ఏర్పాటు చేసిన 300 కిలోల కేక్‌ను ధర్మరాజు కట్ చేసి అభిమానులకు పంచారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల కూటమి నేతలు హాజరై పెన్నులు, పుస్తకాలు, వంటి బహుమతులు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు, అన్ని శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

వాహనాల తనిఖీల్లో రూ.లక్షా 42 వేల జరిమానా



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, మే 21(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన మోటార్ వాహనాల తనిఖీల్లో 32 కేసులు నమోదు చేసి రూ.లక్షా 42 వేల అపరాధ రుసుం విధించినట్టు జిల్లా ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ తెలిపారు.ఏలూరు మండలం చొదిమెళ్ల సెంటర్లో జరిగిన వాహన తనిఖీల సమయంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్, లైసెన్సు కలిగి ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలను వాహన చోదకులకు కరీమ్ వివరించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్‌ధరించాలని, లైసెన్సు లేకుండా వాహనానలు నడిపితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. వాహనాలను నడిపే సమయంలో వాహన దారులు లైసెన్స్‌తో పాటుగా సంబంధిత వాహన పత్రాలను వాహనాలతో పాటుగా ఉంచుకోవాలని, రహదారి భద్రతా నియమాలను తప్పక పాటించాలన్నారు. ఈ తనిఖీల్లో వాహన తనిఖీ అధికారులు బి.శేఖర్, ఎస్.రంగనాయకులు, జి.నాగమురళి, జి.స్వామి, వై.సురేశ్ బాబు, కల్యాణి పాల్గొన్నారు.



ఇటుకల నాణ్యతను పరిశీలిస్తున్న పీవో రాములు

శివారు గ్రామాల్లో ఐటీడీఏ పీవో పర్యటన

బుట్టాయగూడెం, మే 21(ఆంధ్రజ్యోతి) : కె.ఆర్.పురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో నిర్మిస్తున్న బహుళ ప్రయోజన భవనాలు, రోడ్డు నిర్మాణాల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రాజెక్టు ఆఫీసర్ కె.రాములు నాయక్ అధికారులకు సూచించారు. బుధవారం మారుమూల గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ భవనాల నిర్మాణాలను పీవో పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును స్థానిక కొండరెడ్లను అడిగి తెలుసుకున్నారు. బహుళ ప్రయోజనాల నిమిత్తం గ్రామస్తులు వాడుకోడానికి ప్రభుత్వం ఒక్కో భవనాన్ని రూ.60 లక్షలతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. అనంతరం గురుగుమిల్లి నుంచి పూచి గొంది వరకు పీఎం జన్‌మన్ పథకంలో మంజూరైన రోడ్డు పనులను ఆయన పరిశీలించారు.గ్రామాల్లో పర్యటించిన పీవో కొండరెడ్లను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఇంజనీరింగ్ డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వినూత్నను అభినందిస్తున్న ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు

ఐసెట్‌లో మెరిసిన ఆదిత్య విద్యార్థిని వినూత్న

ఏలూరు, మే 21(ఆంధ్రజ్యోతి) : ఏపీ ఐసెట్ ఎంట్రన్స్‌లో ఏలూరు ఆదిత్య డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం (బీబీఏ)చదువుతున్న కొమ్మిన వెంకట శ్రీవినూత్న 59వ ర్యాంకుతో సత్తా చాటింది. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ పంగా వెంకటేశ్వరరావు వినూత్నను అభినందించారు. బీఎస్సీ చదువుతున్న పలివెల నవ్య 399వ ర్యాంకు, బీబీఏ చదువుతున్న షేక్ అమానుల్లా 477ర్యాంకు, బీఎస్సీ చదువుతున్న అబ్దుల్ బీబీ అమీనా 634వ ర్యాంకు సాధించినట్టు ప్రిన్సిపాల్ వివరించారు.

యోగాతో మానసిక ప్రశాంతత : బొరగం



పోలవరంలో యోగా సాధన చేస్తున్న బొరగం

ఏలూరు టూటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): మనిషి శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఒక్కటే మార్గమని కోఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్.పెదబాబు,కమిషనర్ భాను ప్రతాప్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర పాలక సంస్థ కార్యాలయంలో సిబ్బంది యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎలాంటి రుగ్మతలైనా రూపుమాపాలంటే యోగా చేయడమే మంచిదన్నారు. డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వి.దుర్గా భవాని, యోగా గురువు శివ, కార్పొరేటర్ కర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● పోలవరం : శారీరక మానసిక ఆరోగ్యానికి యోగా అవసరమని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. యోగాంధ్రను పురస్క రించుకుని బుధవారం పోలవరం సచివాలయంలో ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో యోగా సాధన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ గంగరాజు, ఫణీంద్ర, కె.లక్ష్మి పాల్గొన్నారు.

● ఏలూరు అర్బన్ : వార్షిక శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం ఏలూరు విన్సెంట్ డీపాల్ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ కేడెట్లకు యోగాసనాలపై డెమో తరగతులు నిర్వహించారు. యోగా గురువు డాక్టర్ ఆదినారాయణ, శిష్యబృందం నేతృత్వంలో వివిధరకాల యోగాసనాలు చేయించి, యోగా ప్రాముఖ్యతపై వివరించారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్‌పాండే, కార్యాలయ సూపరింటెండెంటు కొండయ్య, ఏఎన్‌వోలు, పీఐ సిబ్బంది పాల్గొన్నారు.

● చింతలపూడి : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో, నగర పంచాయతీ ఆధ్వర్యంలో వేగి లింగేశ్వర స్వామి చెరువు వాకింగ్ ట్రాక్‌పై యోగా సాధన చేశారు. జె.సూరారెడ్డి, కమల ఆధ్వర్యంలో యోగా చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

● లింగపాలెం : యోగా ప్రతిఒక్కరి జీవితాల్లో భాగం కావాలని ఎంపీడీవో కందుల వాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన యోగాంధ్ర క్యాంపెయిన్‌లో తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం:యోగాసానాల వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. యోగా డేను పురష్కరించుకుని బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన యోగా శిక్షణలో పాల్గొని యోగాసానాలు వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.వి.చలపతిరావు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

జీలుగుమిల్లి, మే 21(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కూలీలు పనిచేసే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మడల కార్యదర్శి కారం నాగ దుర్గ డిమాండ్ చేశారు. బుధవారం దాట్ల వారిగూడెం, వంకవారిగూడెం, గ్రామాల్లో ఉపాధి కూలీలతో పని చేసే ప్రదేశంలో సమస్యలపై చర్చించారు. టెంట్, మెడికల్ కిట్ వంటి అత్యవసర సదుపాయాలు కల్పించాలన్నారు. సి.హెచ్.సీతారామయ్య, కారం లక్ష్మీ, రాముడు, వెంకటలక్ష్మి, స్వప్న ఉన్నారు.

పరమేశ్వరస్వామికి ఎమ్మెల్యే చంటి పూజలు

ఏలూరుటూటౌన్, మే21(ఆంధ్రజ్యోతి): అశోక్ నగర్‌లోని శ్రీగౌరీపరమేశ్వర స్వామి ఆలయంలో స్ఫటికలింగ ప్రతిష్ఠను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చంటి పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, నాయుడు సోము, శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించండి

ఏలూరు రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా రజక జన మహాసభ బుధవారం ఏలూరులోని రజక సంఘ భవనంలో జరిగింది. ఈ సభలో రజక జన మహాసభ సంఘం అధ్యక్షుడు చిలకపల్లి కట్లయ్య మాట్లాడుతూ రజకులకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనేక గ్రామాల్లో చెరువులు కేటాయించకపోగా వృత్తి పరంగా ఇబ్బందులు కలుగజేస్తున్నారన్నారు. జీవోను అనుసరించి రజకులకు చెరులువు కేటాయించాలన్నారు. సమావేశంలో నాయకులు చిలం రావుల కృష్ణ, కే వీర్రాజు, దుర్గారావు, మురళి, విటాల శ్రీనివాసరావు, పగడాల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళి

ఏలూరు కార్పొరేషన్/చింతలపూడి, మే 21(ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధా ని రాజీవ్ గాంధీ వర్ధంతిని బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. చింతలపూడిలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వి.సుందరరావు ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమాల్లో నాయకులు పాల్గొన్నారు..

జీసీసీలో 95 శాతం లక్ష్యాలను సాధించాం

బుట్టాయగూడెం, మే 21(ఆంధ్రజ్యోతి) : కోటరామచంద్రాపురం గిరిజన సహకార సంస్థ(జీసీసీ)లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 95 శాతం లక్ష్యాలను సాధించినట్టు రంపచోడవరం డివిజనల్ మేనేజర్ పార్వతీశం తెలిపారు. కె.ఆర్.పురం జీసీసీ కార్యాలయానికి వచ్చిన డీఎం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం కె.ఆర్.పురం జీసీసీకి రూ.27 కోట్లను లక్ష్యంగా పెట్టగా రూ.26.50 కోట్లను అమ్మకాలు, కొనుగోళ్ల ద్వారా సాధించినట్టు తెలిపారు. ఇటీవల బ్రాంచ్ సీనియర్ మేనేజర్‌గా నియమితులైన సి.హెచ్.రాజయోగికి బాధ్యతలు అప్పగించారు.

ప్రజా వ్యతిరేకవిధానాలపై పోరాడాలి : వంకా

ఏలూరు రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసీపీ ఏలూరు పార్లమెంట్ పరిశీలకులు వంకా రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం ఏలూరు క్రిస్టల్ కల్యాణ మండపంలో వైసీపీ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రామాల్లో వైసీపీ అభివృద్ధి కోసం కృషి చేయాలని, సూపర్ సిక్స్ హామీల విషయంలో ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ మే నెల నాటికి అన్ని కమిటీలు ఎంపిక చేయాలని జగన్మోహన్‌రెడ్డి సూచించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మేకా వెంకట ప్రతాప్, వాసుబాబు, మామిళ్ళపల్లి జయప్రకాష్, కారుమూరి సునీల్ పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి పూజలు

పెదపాడు, మే 21(ఆంధ్రజ్యోతి): అప్పనవీడు అభయాంజనేయ స్వామిని జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు అందజేశారు.

ఏఎంసీ చైర్మన్ పూజలు..

అప్పనవీడులోని అభయాంజనేయ స్వామిని దెందులూరు మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్ గారపాటి రామసీత బుధవారం సందర్శించారు. ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్తూ మార్గమధ్యలో స్వామిని దర్శించుకున్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడిగా లంకా సత్యనారాయణ

ద్వారకాతిరుమల, మే 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షునిగా లంకా సత్యనారాయణను మరోసారి నియమించారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా ద్వారకా తిరుమలకు చెందిన బీసీ నేత మటపర్తి రూపేశ్ కుమార్‌ను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు నియమించారు. వీరి నియామకం పట్ల పలువురు టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

భవన నిర్మాణ సంక్షేమ శాఖ బోర్డును పునరుద్ధరించాలి

ఏలూరు కార్పొరేషన్, మే 21(ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ సంక్షేమ శాఖ బోర్డును పునరుద్ధరించి పెయింటర్స్‌తో సహా నిర్మాణ రంగ కార్మికులకు సైతం పథకాలు అమలు చేయాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే, ఉపాధ్యక్షులు భజంత్రి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్ఫూర్తి భవన్‌లో బుధవారం జరిగిన సమావేశానికి పి.వంశీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాంగే మాట్లాడుతూ సీఎం తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంక్షేమ బోర్డుకు మొదటగా తాను కోటి రూపాయలు జమ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ ఇచ్చి ఏడాది గడిచినా నిధులు ఇవ్వలేదన్నారు. ఆయన వెంట యూనియన్ నాయకులు అజిత్ కుమార్,వి.శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, పలివెల సాయి, బికోట సత్యనారాయణ, వెంకటరమణ, వైప్రసాద్, బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ద్వారకాతిరుమల, మే 21(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలో ఫిట్స్ వ్యాధితో కుప్పకూలిన గుర్తు తెలియని ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళవారం ఓ వ్యక్తి స్థానిక లింగయ్య చెరువు వద్ద ఫిట్స్ వచ్చి కిందపడి పోవడంతో అతడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.




చిత్రపటం అందజేస్తున్న వెంకట గణేశ్

నూకాలమ్మ సన్నిధిలో వెలమ కార్పొరేషన్ చైర్మన్ వెంకట గణేశ్ కుమార్

జంగారెడ్డిగూడెం, మే 21(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీనూకాలమ్మను రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పోలుపర్తి వెంకట గణేశ్ కుమార్, సత్యవతి దంపతులు కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ రాజాన పండు అయనకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశ్ కుమార్ మాట్లాడుతూ నూకాలమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అమ్మదయ కూటమి ప్రభుత్వంపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గణేష్ కుమార్‌ను ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు గాలి నూకరాజు, కోశాధికారి నౌడు సత్య నూకరాజు, వెలమ సంక్షేమ సంఘం కార్యదర్శి పైల చంటి, పంచాడ రామకృష్ణ పాల్గొన్నారు.

మానవత సభ్యుడు ప్రసాద్ మృతి



పెదపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి) : మానవత సభ్యుడు, నవీన టైప్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకుడు శిష్టా శ్రీరామచంద్ర ప్రసాద్ (72) బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. శ్రీరామచంద్ర ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 1986లో పెదపాడులో నవీన టైప్ ఇనిస్టిట్యూట్‌ను స్థాపించి ఎందరికో టైపింగ్‌లో శిక్షణనిచ్చి వారిని తీర్చిదిద్దారు. టైప్ మాస్టర్‌గా సుపరిచితులైన శ్రీరామచంద్ర ప్రసాద్ వద్ద శిక్షణ పొందిన అనేక మంది నేడు ఉన్నత పదవుల్లో ఉన్నారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

జంగారెడ్డిగూడెం, మే 21(ఆంధ్రజ్యోతి) : మైసన్నగూడెంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త ఈమని శశి కుమార్ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ సాధు పవన్ కుమార్ శర్మ బ్రహ్మోత్సవంలో పూజలు నిర్వహించారు. దాదాపు ఎనిమిది వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ జీఎం రాజగోపాల్ జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, గ్రామ పెద్దలు కుర్రు సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు ఆలయ ముఖద్వారం ప్రారంభం

చాట్రాయి, మే 21(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలో నిర్మించిన వీరాంజనేయస్వామి ఆలయ ముఖద్వారాన్ని గురువారం ఉదయం 9 గంటలకు మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం మంత్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని గ్రామ ప్రజలు, భక్తులు, కూటమి శ్రేణులు పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు.



నేడు కైకలూరులో హనుమాన్ శోభాయాత్ర

కైకలూరు, మే 21(ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి సందర్భంగా గురువారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కైకలూరు వింజరం నుంచి కైకలూరు మార్కెట్‌యార్డు మీదుగా అటపాక ఆంజనేయ స్వామి ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే కామినేని ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. కైకలూరు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ యాత్రలో పాల్గొనాలని వీహెచ్‌పీ, జయ హనుమాన్ ధర్మరక్షణ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

జిల్లాకు అంబేడ్కర్ వర్సిటీ మణిహారం: మంత్రి

నూజివీడు, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు జిల్లాలో బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయం శుభపరిణామం అని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. జిల్లాకు వర్సిటీ మణిహారం అవుతుందన్నారు. అనివార్య కారణాల వల్ల విద్యకు దూరమైన విద్యార్థులు ఈ వర్సిటీ ద్వారా దూరవిద్యను అభ్యసించి తమ విద్యను కొనసాగించే అవకాశం కలుగుతుందన్నారు. చదువుకు వయసుతో సంబంధం లేకుండా దూరవిద్య ద్వారా డిగ్రీలను పొందవచ్చన్నారు. తద్వారా అక్షరాశ్యత రేటు పెరుగుతుందని, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ముఖ్యంగా యువత, మహిళలు దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాలిటెక్నిక్ నూతన కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి డిప్లొమా ఇన్ ల్యాండ్ స్కేపింగ్, నర్సరీ మేనేజ్‌మెంట్‌పై నూతన కోర్సును ప్రవేశపెట్టామని, దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నూజివీడు ఉద్యానవన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి.అపర్ణ తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ పరిధిలో రెండేళ్ల కోర్సును నూతనంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను పొందవచ్చని జూన్ 19 వరకు తమ దరఖాస్తులను దాఖలు చేయవచ్చన్నారు. పాలిటెక్నిక్ పూర్తిచేసిన వారు హార్టిసెట్ ప్రవేశపరీక్ష ద్వారా డీఎస్సీ హార్టికల్చర్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందవచ్చని, అనంతరం వీహెచ్ఏ ఉద్యోగాలకు అర్హత సాధించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూడాట్ డీఆర్‌వైఎస్‌హెచ్‌యూ డాట్ ఈడీయూ డాట్ ఇన్‌లో చూడవచ్చన్నారు.

చేపల గూళ్ల తొలగింపునకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలిదిండి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరులో చేపల గూళ్ల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని మత్స్యశాఖాధికారి రవికుమార్ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం 'ఉప్పుటేరులో అక్రమంగా చేపల గూళ్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికా రులు స్పందించారు. ఉప్పుటేరులో చేపల గూళ్ల ఏర్పాటు చేయ టానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. పీడబ్ల్యూడి శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి చేపల గూళ్ల తొలగింపుకు చర్యలు చేపడతామన్నారు.



'సుప్రభాత సూర్యుడు' ఆవిష్కరణ

నూజివీడు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): నూజివీడు అమర్‌భవన్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై పద్య కావ్యాన్ని ఆధ్యాత్మికవేత్త అత్తిలి వెంకటరమణ బుధవారం ఆవిష్కరించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకులు ఈమని శేషయ్య రచించిన ఈ పద్య కావ్యాన్ని ఆవిష్కరించగా పలువురు ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఎండీయూ ఆపరేటర్ల వినతి పత్రం

చాట్రాయి, మే 21 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో తమను కొనసాగించాలని కోరుతూ ఎండీయూ ఆపరేటర్లు బుధవారం తహసీల్దార్ ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. మండలంలో ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు 22 మంది ఉపాధి పొందుతున్నామని, వైసీపీ ప్రభుత్వం 2027 జనవరి వరకు వాహనాలు కొనసాగిస్తామని హామీ ఇచ్చిందని, కూటమి ప్రభుత్వం జూన్ 1 నుంచి రేషన్ షాపుల ద్వారా రేషన్ పంపిణీ చేస్తామని ప్రకటించటంతో తాము ఆందోళన చెందుతున్నామని, ఈ విధానాన్ని కొనసాగించి జీవనోపాధి కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ

కైకలూరు,మే 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పశువుల పెంపకానికి రాయితీపై అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తామరకొల్లు నీటి సంఘం అధ్యక్షుడు గంగుల ఏసురాజు అన్నారు. బుధవారం తామరకొల్లు రైతులకు పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సబ్సిడీపై దాణాను పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ నున్న వనితాజ్యోతి, కూటమి నాయకులు చే బోయిన శ్రీనివాసరావు, కుర్మా నవీన్, యాతం సోమేశ్వరరావు, కె.సూర్య నారాయణ, పశువైద్య అధికారి నున్నా ఫణీంద్ర, గోపాలమిత్ర డి. విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి : ఎంవీఐ

చాట్రాయి, మే 21 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు, యజమానులు తప్పనిసరిగా రవాణాశాఖ నిబంధనలు పాటించాలని నూజివీడు ప్రాంతీయ రవాణాశాఖ అధికారిణి కృష్ణవేణి కోరారు. విజయవాడ-సత్తుపల్లి రహదారిలో చనుబండ వద్ద బుధవారం ఆమె వాహనాలు తనిఖీ నిర్వహించారు. బీమా, ఫిట్‌నెస్, రోడ్డు టాక్సు తప్పనిసరిగా చేయించుకోవాలని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపేవారికి చలానాలు విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని అన్నారు.

నైట్ వాచ్‌మెన్ జీతం బకాయిలు చెల్లించాలి

ముసునూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల నైట్ వాచ్‌మెన్ బకాయి వేతనాలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. బుధవారం గుడిపాడులో జరిగిన పాఠశాల నైట్ వాచ్‌మెన్ వర్కర్స్ ఫెడరేషన్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 3 నెలల నుంచి వేతనాల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి యూనిఫాం, రక్షణ పరికరాలివ్వాలని డిమాండ్ చేశారు. కమిటీ సభ్యులు పల్లిపాము భవాని, ముక్కు నాగేశ్వరరావు, శివ ఆంజనేయులు, పాముల కృష్ణ, ఆముదాల చినబాబు పాల్గొన్నారు.



క్రైస్తవ ప్రార్థన నిర్వహిస్తున్న పాఠశాల

ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మత ప్రార్థనలు

అభ్యంతరం తెలిపినందుకు ఒకరిపై దాడి

నూజివీడు మే 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో క్రైస్తవ మత ప్రార్థనల ఏర్పాటుపై ప్రశ్నించిన యువకులపై దాడి చేసిన విషయం నూజివీడు మండలం దిగవల్లిలో చర్చనీయాంశమైంది. దిగవల్లి ఎంపీపీ పాఠశాలలో మంగళ, బుధవారాల్లో క్రైస్తవ మత ప్రార్థనలు ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు అభ్యంతరం తెలుపుతూ వీడియో చిత్రీకరించబోగా అక్కడున్న కొందరు వీడియో చిత్రీకరిస్తున్న సెల్‌ఫోన్‌లను లాక్కుని యువకులపై దాడి చేయడంతో గ్రామానికి చెందిన ఆకిరెడ్డి శ్రీహరి అనే యువకుడు గాయపడ్డాడు. క్షతగాత్రుడిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పాఠశాల ఆవరణలో అంగన్వాడీ కేంద్రం కూడా నడుస్తోందని ప్రార్థన లకు పాస్టర్లు మీటర్ నుంచి అక్రమంగా విద్యుత్‌ను సైతం చౌర్యం చేస్తున్నట్టు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.





పాఠశాల మీటర్ నుంచి విద్యుత్ చౌర్యం, గాయపడిన యువకుడు

ఏకగ్రీవాలా.. పోటీనా?



నూజివీడు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూలేని విధంగా తెలుగుదేశం పార్టీలో పార్టీ సంస్థాగత పదవుల కోసం నూజివీడు తెలుగు తమ్ముళ్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. ఈ నియోజకవర్గంలో నూజివీడు, నూజివీడు పట్టణ, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాలు ఉన్నాయి. 3 మండలాలు, నూజివీడు పట్టణంలో కార్యవర్గాలు మారే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

- ఆసక్తికరంగా పార్టీ ఎన్నికలు
- ముసునూరు మండలంలో తీవ్ర పోటీ

నూజివీడు, మే 21 (ఆంధ్రజ్యోతి): గురువారం నూజివీడులో జిల్లా స్థాయి మినీ మహానాడు జరుగుతోంది. అయినా ఇంకా నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో కమిటీ అధ్యక్ష పదవికి పోటీ పడటంతో పరిశీలకుల పేర్లు రాసి అదిష్టానానికి ఎంపిక కోసం పంపారు. ఇంకా ఎంపిక జరగలేదు. గ్రామస్థాయి అధ్యక్ష పదవి తంతు పూర్తికాకుండానే మండల పార్టీ అధ్యక్ష పదవి కోసం పలువురు నాయకులు గ్రామాల్లో తమ మద్ధతు తెలపాలని కోరుతూ ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. ఈ నియోజకవర్గంలో 2004లో నూజివీడు పట్టణ అధ్యక్ష ఎంపిక కోసం మాత్రమే తీవ్ర పోటీ ఏర్పడటంతో నాడు జిల్లాస్థాయి నాయకులు వచ్చి ఎన్నిక జరిపి కమిటీని ఏర్పాటు చేశారు. ఇంత వరకు ఆ ఎన్నిక తప్ప పార్టీ సంస్థాగత పదవులు అన్ని ఏకగ్రీవంగానే ప్రశాంతంగా జరిగాయి. తిరిగి ఇప్పుడు 2025లో పోటీ తీవ్రంగా కనబడుతోంది. ముఖ్యంగా ముసునూరు మండల అధ్యక్ష పదవి కోసం పలువురు పోటీ పడటంతో ప్రతి నియోజకవర్గంలో ఈ మండల రాజకీయ పరిస్థితి చర్చనీయాంశంగా మారింది. ఈ మండలం నుంచి మందలపు వెంకటేశ్వరరావు (మునసబు), గద్దె రఘు, ఉప్పలపాటి గణేష్, కొల్లి గంగారామ్, చల్లగుళ్ళ నాని, శ్యామలరావు పేర్లు గట్టిగా వినబడుతున్నాయి. దీంతో నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి పార్థసారథికి తలనొప్పిగా పరిణమించింది. శ్యామలరావుకు బలివే గుడి కమిటీ అధ్యక్ష పదవి ఇచ్చి వివాద రహితుడు, సౌమ్యుడైన మండల కమిటీలో అనేకసార్లు కార్యదర్శిగా పనిచేసిన కందుల పిచ్చియ్యను అధ్యక్ష పదవికి ఎంపిక చేస్తే బావుంటుందనే సూచనలు పార్టీ అదిష్టానానికి వెళ్ళినట్లు సమాచారం. ఆగిరిపల్లి మండలం నుంచి ఆరేపల్లి శ్రీనివాసరావు, నక్కబోయిన వేణు మండల పార్టీ అధ్యక్ష పదవి ఆశిస్తున్నారు. అయితే మంత్రి ఎవర్ని నియమించినా మండల పార్టీ ఆ ఎంపికను శిరసా వహిస్తుంది. చాట్రాయి మండలం నుంచి తీవ్ర పోటీ అయితే లేదు. మండలం నుంచి యజ్జిగ వెంకటేశ్వరరావు, కందుల కృష్ణ పేర్లు వినబడుతున్నాయి. ఇక్కడ కూడా ఎవర్ని ఎంపిక చేసినా ఆమోదించటానికి మండల తెలుగుతమ్ముళ్లలో సుముఖత కనిపిస్తోంది.

ఇక నూజివీడు మండలం నుంచి ప్రస్తుత మండల అధ్యక్షుడు ముసునూరు రాజా, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పొట్లూరి సత్యనారాయణ పేర్లు వినబడుతున్నా ఇక్కడ కూడా మంత్రిదే తుది నిర్ణయం. ఇక కీలకమైన నూజివీడు పట్టణ కార్యవర్గం పూర్తిగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. పట్టణ అధ్యక్ష పదవి కోసం మాజీ కౌన్సిలర్ పాదం సత్యనారాయణ, ప్రస్తుత కౌన్సిలర్ చెరుకూరి దుర్గాప్రసాద్, ప్రస్తుత టీడీపీ ఉపాధ్యక్షుడు తిరుమలశెట్టి ప్రదీప్‌కుమార్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు ప్రశాంతంగా ఏకగ్రీవంగా జరిగిన ఈ నియోజకవర్గ పార్టీ సంస్థాగత ఎన్నికలు ఇప్పుడు టీ కప్పులో తుఫాన్‌లా సమసిపోయి ఏకగ్రీవాలు అవుతాయా? లేక పోటీలు అనివార్యమా? అనేది కొది రోజుల్లో తెలుస్తుంది.

ఇంటర్వ్యూ..

ఉపాధి నిధులతో సీసీ రహదారుల నిర్మాణం

బీవీ సత్యనారాయణ, ఎంపీడీవో



- **గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన చర్యలు?**

జవాబు: నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి, ప్రత్యేక నిధులతో నూతన బోర్లు వేశాం. డ్రెయినేజీల పునరుద్ధరణకు సర్పంచ్‌లు, కార్యదర్శులు చర్యలు చేపట్టారు. ఉపాధి నిదులతో నూతనంగా సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటన్నాం.

- **స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ అమలు ఎలా ఉంది?**

జవాబు: ప్రతిరోజూ చెత్త సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తున్నాం, వానపాముల ఎరువు తయారీ ప్రక్రియ నడుస్తోంది.

- **ప్రభుత్వ కార్యక్రమాలెలా అమలవుతున్నాయి?**

జవాబు : సొంత స్థలం ఉన్న వారికి ఇళ్ల నిర్మాణాలు, జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి తదితర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో ఇచ్చిన సర్వేలను సకాలంలో పూర్తి చేస్తున్నాం.

- ముసునూరు (ఆంధ్రజ్యోతి)

పనుల్లో ఏదీ నాణ్యత?

మరమ్మతులు చేపట్టిన రహదారికి మళ్లీ పగుళ్లు!





వదాలి వద్ద మరమ్మతులు చేసిన రోడ్డుపై పడిన గోతుల పూడిక పనులు (ఇన్‌సెట్) రోడ్డుకు పగుళ్లు

ముదినేపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): రహదారుల ప్రత్యేక మరమ్మతు పనుల్లో నాణ్యత లోపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రోడ్ల మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరు గారిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముదినేపల్లి - భీమవరం (వయా సింగరాయపాలెం) ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో మరమ్మతు పనులు నిర్వహించిన 20 రోజుల్లోనే వడాలి గ్రామం వద్ద రోడ్డుకు పగుళ్ల ఏర్పడటం, రోడ్డు మధ్యే గోతులు పడటం ఇందుకు నిదర్శనం. రూ.4 కోట్లకుపైగా వ్యయంతో నిర్వహించిన ఈ పనులు అనతి కాలంలోనే మరమ్మతులకు గురికావడం విమర్శలకు దారి తీసింది. ఇది గమనించిన ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం వడాలి గ్రామం వద్ద పగుళ్ళు ఏర్పడిన, గోతులు పడిన ప్రదేశాల్లో తిరిగి మరమ్మతు పనులు చేపట్టారు.



అక్రమ నిర్మాణాల పరిశీలన

కైకలూరు, మే 21(ఆంధ్రజ్యోతి): కైకలూరు పట్టణంలో డ్రెయిన్ రహదారి ఆక్రమణలను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పలువురు నేతలు పేర్కొన్నారు. బుధవారం కైకలూరు బైపాస్ రోడ్డులోని దానగూడెం రోడ్డు వద్ద అక్రమ నిర్మాణాలను కూటమి నేతలు పరిశీలించారు. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే బైపాస్‌రోడ్డు మలుపులో గత వైసీపీ హయాంలో డ్రైన్‌పై నిర్మించిన అక్రమ భవనాలను తొలగించాలని తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం దృష్టికి కూటమి నేతలు తీసుకువెళ్ళినట్లు తెలిపారు. రహదారి పొడవునా ఎక్కడ ఆక్రమణ లు ఉన్నా తొలగించి వాహనాల రాకపోకలను ఆటంకం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను గుర్తించామని పార్టీలకతీతంగా ఏ పార్టీ వారైనా కట్టడాలపై చర్యలు తప్పవన్నారు. జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి పూల రామచంద్రరావు, ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, జనసేన నాయకులు తులసి పూర్ణాచంద్రరావు, నాగరాజు, పుప్పాల సూర్యప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా గండి పూడ్చకుంటే ధర్నా : సీపీఐ

నూజివీడు టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పెద్దచెరువు గండ్లను వారంలోపు పూడ్చకపోతే మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతామని, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు తెలిపారు. గండి పూడ్చండి శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనంతో నూజివీడు పెద్దచెరువును సీపీఐ బృంద సభ్యులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత వర్షాకాలంలో చెరువుకట్ట నాలుగుచోట్ల తెగి నూజివీడులోని కొప్పుల వెలమపేట తదితర ప్రదేశాల్లో నివేశనాగృహాల్లోకి నీరు ప్రవేశించిందన్నారు. నాడు యుద్ధప్రాతిపదికన గండ్లుపూడ్చుతున్నామని చెప్పినా అది నేటికీ అమలు కాలేదన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గండ్లను పూడ్చకపోతే చెరువు కింద పొలాలు ముంపునకు గురవడంతో పాటు పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అంతేకాక వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గండ్లను తక్షణం పూడ్చాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకులు నిమ్మగడ్డ నరసింహ, ఎం.నాగేంద్రరావు, ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.



నూజివీడు పెద్దచెరువు గండి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

నేడు నూజివీడులో టీడీపీ జిల్లా మినీ మహానాడు

(ఐదో పేజీ తరువాయి)

ఏఎంసీ మార్కెట్ యార్డులో గురువారం నిర్వహించే మినీ మహానాడుకు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలన్నారు. మహానాడు ఏర్పాట్లుకు సంబంధించి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి మండల అధ్యక్షులు, గ్రామ పార్టీ, బూత్ కమిటీ అధ్యక్షులు, క్లస్టర్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు భారీగా తరలి వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా ఆ మేరకు చర్యలు చేపట్టాలన్నారు. నూజివీడు నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి చర్చించి తీర్మానాలు చేపట్టాలని, మెజార్టీ కార్యకర్తల నిర్ణయం మేరకే మండల పార్టీ నాయకుల ఎంపిక జరుగుతుందన్నారు. నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, ముసునూరు మండల టీడీపీ అధ్యక్షుడు దేవినేని ఢల రామ్, నూజివీడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, ఆరేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల యోగాభ్యాసం

కలెక్టర్ ఆదేశాలతో నెల్లాళ్లపాటు నిర్వహించనున్నట్టు వెల్లడి



యోగాభ్యాసాన్ని నిర్వహిస్తున్న ఎంపీడీవో ఆనంద్‌బాబు

ఆగిరిపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో యోగాంధ్ర యోగా దినోత్సవాలను కలెక్టర్ వెట్రిసెల్వి నిర్వహించమని ఆదేశించారని ఎంపీడీవో బి.ఆనంద్‌బాబు తెలిపారు. అందులో భాగంగా బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో యోగాభ్యాసం నిర్వహించామని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగా నిర్వహించాలని తెలిపారు. ఏవో సలాం, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి: యోగా డేను పురస్కరించుకుని కలిదిండి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం యోగాపై శిక్షణ, అవగాహన సదస్సులను అధికారులు నిర్వహించారు. యోగాసనాలను నేర్పించి అవగాహన కల్పించారు. ఎంపీడీవో కొండలరావు, కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కలిదిండిలో యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న అధికారులు

హనుమజ్జయంతికి ఆలయాల ముస్తాబు



చాట్రాయిలో ముస్తాబైన స్వామివారి విగ్రహం

చాట్రాయి, మే 21(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలోని హనుమాన్ విగ్రహం వద్ద గురువారం హనుమజ్జయంతికి భారీ ఏర్పాట్లు చేశారు. భారీగా భక్తులు వస్తారనే అంచనాతో ఎస్సై రామకృష్ణ ఆలయానికి వచ్చి పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు సౌకర్యాలపై చర్చించారు. భారీ అన్నసమారాధన జరగనున్నది. పర్వతాపురం సెంటర్‌లోని హనుమాన్ విగ్రహం వద్ద అన్నదానం చేస్తున్నట్టు కమిటీ తెలిపింది.

ముదినేపల్లి: హనుమజ్జయంతి ఉత్సవాలు బుధవారం ముదినేపల్లి మండలంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ముదినేపల్లి మారుతీనగర్‌లోని సువర్చలా సమేత భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా స్వామి, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించి అర్చకుడు బృందావనం చక్ర పద్మ నరసింహం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆలయం వద్ద హోమాలు, పూజలు జరిగాయి. సంఘ అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు, వాసవీ సేవా దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వత్తుమిల్లి ప్రసాద్ పర్యవేక్షణలో భక్తులు పూజలు నిర్వహించారు. చేవూరు, బొమ్మినంపాడు, వాడవల్లి, శ్రీహరిపురం, నారాయణపురం, పెదగొన్నూరు, ఉప్పరగూడెం తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

కలిదిండి: కలిదిండిలో గురువారం అభ యాంజనేయ స్వామికి పూజల అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహి స్తున్నామని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది. పాతాళ భోగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు గల 18 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు, అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నామని భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ముసునూరు: మండల వ్యాప్తంగా ఆంజనేయ స్వామి ఆలయాలు హనుమజ్జయంతికి ముస్తాబయ్యాయి. ఆలయాలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, ఆకు పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ముసునూరు సిల్క్‌నగర్‌కాలనీ, గోగులంపాడు, గోపవరం బీసీ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో అన్నసమారాధనలు జరగనున్నాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

పెదపాలపర్రు టీడీపీ కమిటీ ఏర్పాటు

ముదినేపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెదపాలపర్రు గ్రామ టీడీపీ నూతన కమిటీ ఎన్నికైంది. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సంక్రాంతి తులసి మాధవరావు, ప్రదాన కార్యదర్శిగా పల్లపోతు వెంకట నాగ వర ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కోడూరు శ్రీనివాసరావు, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. నూతన కమిటీని పార్టీ మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి అభినందించారు.

టెన్త్ సప్లిమెంటరీకి 30 శాతం విద్యార్థుల గైర్హాజరు

ముదినేపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని జడ్పీ హైస్కూలు పరీక్షా కేంద్రంలో బుధవారం జరిగిన టెన్త్ ఇంగ్లీష్ పరీక్షకు 30 శాతం మంది విద్యార్థులు హాజరు కాలేదు. ఈ పరీక్షా కేంద్రంలో 58 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 17 మంది గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ వి.ప్రభుదాసు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ముదినేపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి అంబేడ్కర్ కాలనీలో గుండెపోటుతో బుధవారం మరణించిన దాసరి సుబ్రహ్మణ్యం అంత్యక్రియలకు ఏపీటీడీసీ డైరెక్టర్ కొడాలి వినోద్ ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు అందజేశారు.

24న భూముల కౌలుకు వేలం

చాట్రాయి, మే 21(ఆంధ్రజ్యోతి): అపర భద్రాద్రి చనుబండ కోదండరామాలయ భూముల కౌలు వేలం 24వ తేదీ ఉదయం 11 గంటలకు జరుగుతుందని ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి తెలిపారు. నరసింహారావుపాలెం, కృష్ణారావుపాలెం గ్రామాల్లోని 12.29 ఎకరాల భూమిని రెండేళ్ల కాలానికి లీజుకు వేలం నిర్వహిస్తామని చెప్పారు. మూడు బిట్‌లుగా వేలం నిర్వహిస్తామని, దరావతు, తదితర వివరాలకు 63039 76174 ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

చీరల పంపిణీ

ముసునూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) లోపూడిలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా మంగళవారం రాత్రి టీడీపీ గ్రామ కమిటీ కార్యదర్శి, ఎన్టీఆర్ వీరాభిమాని బందిల పవన్‌కుమార్ సుమారు 100 మంది వృద్ధులు, వితంతువులకు చీరలను పంపిణీ చేశారు. పొదిలి రాంబాబు, బందిల జయరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



కాలినడకన ద్వారకా తిరుమలకు..

చాట్రాయి, మే 21(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేలకు చెందిన 14 మంది భక్తులు బుధవారం చాట్రాయి మీదుగా కాలినడకన ద్వారకా తిరుమల బయలుదేరారు. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటామని, తమ కుటుంబాలను చల్లగా చూస్తే కాలినడకన వస్తామని మొక్కుకున్నామని భక్తులు చెప్పారు.